# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 137 | బుధవారం | 17-12-2025 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com


ముగిసిన ఐపీఎల్ వేలం..




05


జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

81062 74466


## హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయండి..

# కేంద్రాన్ని కోరిన సీఎం

- హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయాలన్న సీఎం
- కేంద్ర విద్యా మంత్రితో రేవంత్ భేటీ
- 9 కేంద్రీయ, 16 నవోదయ విద్యాలయాల డిమాండ్
- విద్యా విస్తరణకు తెలంగాణ ప్రతిపాదనలు

02








## కబడ్డీ ప్లేయర్ ని కాల్చి చంపారు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
పంజాబ్‌లోని మొహాలీలో విషాద ఘటన చోటు చేసుకుంది. ప్రముఖ కబడ్డీ ప్లేయర్, ప్రమోటర్ అయిన రాణా బాలచౌరియాని దుండగులు దారుణంగా కాల్చి చంపారు. కబడ్డీ టోర్నమెంట్ మధ్యలోనే ప్రేక్షకులు చూస్తుండగా దుండగులు కాల్పులు జరిపి హతమార్చారు. ఈ దారుణ ఘటన వందల మంది ప్రేక్షకుల సమక్షంలో జరగడంతో ఒక్కసారిగా

మిగతా 2వ పేజీలో..



02

## నేడు హైదరాబాద్ కు రాష్ట్రపతి ముర్ము




02

## నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా,రాహుల్ కి ఊరట




02

## జీహెచ్ఎంసీ మీటింగ్ లో ఉద్రిక్తత



## కూతురిని మూడో అంతస్తు పై నుంచి పడేసిన తల్లి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
నగరంలోని మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వసంతపురి కాలనీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కన్నకూతురిపై తల్లీ దాష్టీకం

మిగతా 2వ పేజీలో..

# జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌పై కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ స్పష్టీకరణ...



- అభ్యంతరాలన్నీ పరిగణనలోకి తీసుకుంటాం..!
- జీహెచ్ఎంసీ వార్డుల డీలిమిటేషన్‌పై కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సమగ్ర వివరణ
- జీహెచ్ఎంసీ పరిధి 650 చ.కి.మీ నుంచి 2060 చ.కి.మీ వరకు విస్తరించినట్లు వెల్లడి
- దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ అవతరణ
- సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, జీహెచ్ఎంసీ అధికారులు కలిసి డీలిమిటేషన్ ఎక్సర్సైజ్
- 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం.

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సమగ్ర వివరణ ఇచ్చారు. జీహెచ్ఎంసీ పరిధి గతంలో 650 చదరపు కిలోమీటర్లుగా ఉండగా, ప్రస్తుతం 2060 చదరపు కిలోమీటర్లకు విస్తరించిందని తెలిపారు. ఈ విస్తరణతో దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ మారిందన్నారు. వార్డుల విభజన ప్రక్రియను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు సమగ్రంగా ఎక్సర్సైజ్ చేసి రూపొందించారని కమిషనర్ వివరించారు. గతంలో ఔటర్ పరిధిలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీ ఇలా నాలుగు రకాల పాలనా వ్యవస్థలు ఉండేవని.. ఇప్పుడు వాటన్నింటినీ కలిపి ఒకే జీహెచ్ఎంసీగా మార్చామని తెలిపారు.

20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసిన అనంతరం వార్డుల విభజన చేపట్టామని ఆయన పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ ప్రక్రియను డిసెంబర్ చివరికి పూర్తి చేస్తే రాబోయే జనగణనకు ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం సూచించిందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఇచ్చే ప్రతి అభ్యంతరాన్ని పరిశీలించి పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు ఇవ్వడానికి రేపు చివరి రోజని తెలిపారు. వార్డుల విభజనలో నాలాలు, ప్రధాన రహదారులు, రైల్వే లైన్లు వంటి నాచురల్ బౌండరీలను ప్రతిపాదికగా తీసుకున్నామని చెప్పారు. అలాగే రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న వార్డులను ఒకే నియోజకవర్గానికి తీసుకురావడమే లక్ష్యంగా పని చేశామని వివరించారు.

మిగతా 2వ పేజీలో..



## సిడ్నీ ఉగ్రవాది

# హైదరాబాద్ వాడే...

- బోండీ బీచ్ కాల్పుల్లో 15 మంది మృతి
- దాడికి హైదరాబాద్ లింక్ వెలుగులోకి
- తండ్రి–కుమారుడు ఐసిస్ ప్రభావంతో దాడి
- తెలంగాణతో సంబంధం లేదన్న అధికారులు

**జర్నలిస్ట్ డైరీ, సిడ్నీ:**
ఆస్ట్రేలియాలోని సిడ్నీ బాండి బీచ్‌లో డిసెంబర్ 14న జరిగిన ఉగ్రదాడిలో 15 మంది మరణించగా, 40 మందికి పైగా గాయపడ్డారు. యూదుల హనుక్కా వేడుకలను లక్ష్యంగా చేసుకుని తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24) కాల్పులు జరిపారు. సాజిద్ ఘటనా స్థలంలోనే పోలీసుల కాల్పుల్లో మరణించగా, నవీద్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడు కావడం ఇప్పుడు సంచలనంగా

మిగతా 2వ పేజీలో..

## సర్పంచులు గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి

- మధిరలో నూతన సర్పంచులకు డిప్యూటీ సీఎం సన్మానం
- గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న భట్టి
- 2047 విజన్‌తో తెలంగాణ నిర్మాణం
- సంక్షేమం, పెట్టుబడులపై ప్రభుత్వ ఫోకస్



**జర్నలిస్ట్ డైరీ, ఖమ్మం:**
ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులను డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధిపై

మిగతా 2వ పేజీలో..

## కొండగట్టు అంజన్న ఆలయానికి

# అటవీశాఖ షోకాజ్ నోటీసు...



02



02

## మరో సారి పోలీస్ కస్టడీకి ఐ బొమ్మ రవి

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ కి ఊరట

**జర్నలిస్ట్ డైరీ, డిల్లీ:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ , రాహుల్ గాంధీ లకు ఊరట దక్కింది. నేషనల్ హెరాల్డ్ కేసులో చార్జ్‌షీట్‌ను ఈడీ అధికారులు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసును పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది.నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్తగా నమోదైన ఎఫ్ఐఆర్‌తో వచ్చే సమస్యలను పరిగణనలోకి తీసుకోవడానికి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు ఏ ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారిస్తున్నారని ప్రశ్నించింది. కేవలం ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. ఈ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర నిందితులు ఈ దశలో ఎఫ్ఐఆర్ కాపీని పొందేందుకు అర్హులు కారని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, ఈ విషయంలో తదుపరి దర్యాప్తు కొనసాగించడానికి ఈడీ అధికారులకు అనుమతి ఇచ్చింది.కేసు బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి చేసిన ప్రైవేట్ ఫిర్యాదు, మేజిస్ట్రేట్ సమన్ల ఆదేశాలసారంగా పరిగణనలోకి తీసుకున్నట్లు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రస్తావించింది. ఎఫ్ఐఆర్ నుంచి కాదని ఈ క్రమంలో విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది.




# జీహెచ్‌ఎంసీ మీటింగ్ లో ఉద్రిక్తత

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:** మంగళవారం జరిగిన జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం లో వార్డుల విభజన పై కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్తగా విలీనం చేసిన 27 మునిసిపాలిటీలతో పాటు, వార్డుల సంఖ్యను 150 నుంచి 300 వరకు పెంచేందుకు ప్రభుత్వం చేసిన డివిజన్ల డీలిమిటేషన్ పై బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు, తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సమావేశం జరుగుతున్న క్రమంలోనే సభలో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. దారుస్సలంలో వార్డుల విభజన చేశారంటూ బీజేపీ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో గెజెట్ పేపర్లను చింపి కౌన్సిల్లో విసురుతూ, మేయర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు బీజేపీ కార్పొరేటర్లు. దీంతో వారిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు . గందరగోళం నడుమ పునర్విజనపై కార్పొరేటర్లు నుంచి వచ్చిన అభిప్రాయాలను, అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని మేయర్ ప్రకటించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ కార్పొరేటర్లు కౌన్సిల్ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. రేవంత్ సర్కార్ ఏంఐఎంకు అనుకూలంగా విభజన చేశారని.. జీహెచ్‌ఎంసీ రిలీజ్ చేసిన మ్యాప్ తప్పుల తడకగా ఉందంటూ ఆందోళన చేశారు. దీంతో అక్కడికి భారీగా పోలీసులు మోహరించారు.

# నేడు హైదరాబాద్ కు రాష్ట్రపతి ముర్ము

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:** శీతాకాలం విడిది కోసం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం హైదరాబాద్ రానున్నారు. రేపు మధ్యాహ్నం 2.25 గంటలకు హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానంలో ఆమె చేరుకోనున్నారు. డిసెంబర్ 17 నుంచి 22వ తేదీ వరకు అంటే.. మొత్తం ఐదు రోజుల పాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ద్రౌపది ముర్ము బస చేయనున్నారు. డిసెంబర్ 19వ తేదీన రామోజీ ఫిలిం సిటీకి వెళ్లనున్నారు. ఆ రోజు ఉదయం 11.00 గంటలకు ఈ ఫిలిం సిటీ వేదికగా జరగనున్న ఆల్ ఇండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. డిసెంబర్ 20వ తేదీన గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో జరిగే సదస్సుకు ముర్ము హాజరవుతారు. హైదరాబాద్‌లో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే ప్రభుత్వం సమీక్ష నిర్వహించింది. సైబరాబాద్ పరిధిలో డ్రోన్లు ఎగురవేతపై పోలీసులు ఆంక్షలు విధించారు. అలాగే అల్వాల్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ల పరిధిలో 17నుంచి 22 వరకు డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్టుల ఎగురవేతపై నిషేధం విధించారు. భద్రతా చర్యల్లో భాగంగా బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



# కబడ్డీ ప్లేయర్ ని కాల్చి చంపారు

**మొదటిపేజీ తరువాయి**

భయాందోళనకు గురైయ్యారు. కాగా, ఈ హత్య ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్దూ మూస్ వాలా హత్యకు ప్రతీకారంగా జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.మొహాలీలో సోమవారం సాయంత్రం కబడ్డీ టోర్నమెంట్ జరుగుతుంది. ప్రేక్షకులు ఆటను ఎంతో ఆసక్తితో తిలకిస్తున్నారు. అంతలోనే కాల్పుల శబ్దం వినిపించింది..దీంతో ప్రేక్షకులు ప్రాణభయంతో పరుగులు తీశారు. అదే సమయంలో కబడ్డీ ప్లేయర్ రాణా బాలచౌరియాపై దుండగులు దాడి చేసి.. అనంతరం కాల్చి చంపారు. తీవ్ర గాయాలతో బాలచౌరియా గ్రౌండ్‌లోనే కుప్పకూలిపోయాడు. ఈ హత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు ముందు దుండగులు రాణా అభిమానులుగా వచ్చి సెల్ఫీ తీసుకుంటామని చెప్పి అతనిపై కాల్పులు జరిపారని మొహాలీ ఎస్పీ హర్మన్ దీప్‌సింగ్ హన్స్ తెలిపారు. అత్యంత దగ్గరగా కాల్పులు జరపడంతో రాణా అక్కడే ప్రాణాలు కోల్పోయాడని అన్నారు. దుండగులు తప్పించుకునే సమయంలో గాల్లో కాల్పులు జరిపారని వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# కూతురిని మూడో అంతస్తు పై నుంచి పడేసిన తల్లి

**మొదటిపేజీ తరువాయి**

వెలుగులోకి వచ్చింది. ఏడు సంవత్సరాల చిన్నారి షారోని మేరిని కన్నతల్లి మోనాలిసా మూడో అంతస్తు బిల్డింగ్‌పై నుంచి కిందకు పడేసింది. దీంతో చిన్నారి తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు షారోనిని హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు విడిచింది.ఘటనపై మల్కాజ్‌గిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు కన్నబిడ్డను భవనంపై నుంచి పడేయడానికి గల కారణాలు ఏంటి అనే దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఏది ఏమైనా కన్న బిడ్డను తల్లి ఇలా కర్కశంగా భవనంపై నుంచి పడేయడం స్థానికంగా సంచలనం రేపింది.

# హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయండి.. కేంద్రాన్ని కోరిన సీఎం

- హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయాలన్న సీఎం
- కేంద్ర విద్యా మంత్రితో రేవంత్ భేటీ
- 9 కేంద్రీయ, 16 నవోదయ విద్యాలయాల డిమాండ్
- విద్యా విస్తరణకు తెలంగాణ ప్రతిపాదనలు




**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM) మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో, 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎం లు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు.

ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి సీఎం వెల్లడించారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్ కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని సీఎం అన్నారు.

తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని సీఎం అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# సిడ్నీ ఉగ్రవాది హైదరాబాద్ వాడే...

**మొదటిపేజీ తరువాయి**



మారింది. 1998లో స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఆ తర్వాత యూరోపియన్ సంతతికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. నవీద్ ఆస్ట్రేలియాలోనే జన్మించిన పౌరుడు. సాజిద్ వద్ద హైదరాబాద్ నుంచి జారీ చేసిన భారత పాస్‌పోర్ట్ ఉన్నట్టు ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్ అధికారులు గుర్తించారు.దాడికి ముందు నవంబర్‌లో తండ్రీకొడుకులు ఫిలిప్పీన్స్‌కు వెళ్లి వచ్చారు. అక్కడ ఐసిస్ సంబంధిత ప్రాంతాల్లో శిక్షణ తీసుకున్నారనే అనుమానాలు ఉన్నాయి. వారి వాహనంలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్‌లు, జెండాలు లభ్యమయ్యాయి. దాడి ఐసిస్

భావజాలం ప్రేరేపితమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.ఘటనపై భారత నిఘా సంస్థలు సాజిద్ కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నాయి. విషయం తెలిసిన హైదరాబాద్‌లోని అతడి బంధువులు షాక్‌కు గురయ్యారు. దర్యాప్తు కొనసాగుతోంది.తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం ఆస్ట్రేలియాకు వలస వెళ్లిన తర్వాత సాజిద్ అక్రమ్ ఆరుసార్లు ఇండియాకు వచ్చినట్లు గుర్తించారు. ఆస్తి విషయాలతో పాటు తల్లిదండ్రులను చూడటానికి సాజిద్ అక్రమ్ హైదరాబాద్ వచ్చినట్టు తెలుస్తోంది. అయితే, తండ్రి చనిపోయిన సమయంలో భారతదేశానికి సాజిద్ రాలేదని పోలీసులు చెప్తున్నారు. సాజిద్ అక్రమ్ ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలియదని పోలీసులు అంటున్నారు. సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ ఉగ్రవాదం వైపు వెళ్ళడానికి స్థానిక ప్రభావం లేదని గుర్తించారు. 1998 సమయంలో సాజిద్ అక్రమ్ పై భారతదేశంలో ఎటువంటి కేసులు లేవని పోలీసులు అంటున్నారు.



# సర్పంచులు గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవల మెరుగుదలపై సర్పంచులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించినట్లు చెప్పారు. 2047 కల్లా రాష్ట్రంలో ఒక లక్ష 30 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 5 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 131 గ్రామపంచాయతీలకు గాను 90 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులు గెలవడం చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు.

ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 20 వేల కోట్ల రూపాయలతో వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రైతులకు 9 వేల కోట్ల రూపాయలతో రైతు భరోసా అందజేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.

# జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్‌పై కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ స్పష్టీకరణ

**మొదటిపేజీ తరువాయి**


తెల్లాపూర్ ప్రాంతాన్ని ఉదాహరణగా పేర్కొన్న కమిషనర్.. ప్రస్తుతం అక్కడ సుమారు 23 వేల జనాభా మాత్రమే ఉన్నప్పటికీ, రాబోయే ఐదేళ్లలో నాలుగు లక్షలకు పైగా జనాభా పెరిగే అవకాశం ఉందన్నారు. పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్మెంట్లు నిర్మాణంలో ఉన్నందున, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అక్కడ వార్డుల సంఖ్యను పెంచామని తెలిపారు. వార్డుల పేర్ల మార్పుపై ఎక్కువగా అభ్యంతరాలు వచ్చాయని, కొన్ని ప్రాంతాల్లో బౌండరీలపై కూడా అభ్యంతరాలు నమోదయ్యాయని కమిషనర్ తెలిపారు. జోన్ల విభజన ఇంకా పూర్తికాలేదని, ప్రస్తుతం తాత్కాలికంగా సమీప మున్సిపాలిటీలను వివిధ జోన్లలో కలిపామని చెప్పారు. ప్రతి అభ్యంతరాన్ని సమగ్రంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కొన్ని వార్డుల్లో ప్రస్తుతం జనాభా తక్కువగా ఉన్నా, భవిష్యత్‌లో జనాభా పెరిగే అవకాశాలను పరిగణనలోకి తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. ఈసారి జరిగే కౌన్సిల్ సమావేశానికి చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ ఎమ్మెల్యేలకూ ఆహ్వానం పంపినట్లు వెల్లడించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలు ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వస్తున్నందున వారి సూచనలు కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు.



# మరో సారి పోలీస్ కస్టడీకి ఐ బొమ్మ రవి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:** తెలుగు సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించేలా, కొత్త చిత్రాలు విడుదలైన వెంటనే ఐబొమ్మ, బప్పం వంటి 17 వెబ్‌సైట్స్ ద్వారా కోట్లు సంపాదించిన బోడపాటి రవి అలియాస్ ఐబొమ్మ రవి కి కోర్టు షాక్ ఇచ్చింది. ప్రస్తుతం రవి పోలీస్ కస్టడీ లో ఉన్నాడు. ఈ మధ్య ఆయన బేయిల్ కోసం పెట్టుకున్న అర్జీని కోర్టు తిరస్కరించింది. కాగా, ఈ పిటీషన్ పై నాంపల్లి కోర్టులో మంగళవారం మరోసారి విచారణ జరిగింది. నేపథ్యంలో రవిని 12 రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకునేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఒక్కో కేసులో 3 రోజుల పాటు విచారించాలని తెలిపింది. ఈ లెక్కన ఐబొమ్మ రవిపై నాలుగు కేసులు ఉండగా.. మొత్తం 12 రోజుల పాటు విచారించనున్నట్లు తెలుస్తుంది. ఈ నెల 18 నుంచి విచారణ మొదలుకానుంది. ఈ కస్టడీ ద్వారా పోలీసులు ఐబొమ్మ రవికి సంబంధించిన వెబ్‌సైట్ కార్యాకలాపాలను విచారించనున్నారు. మరోవైపు అతనికి బెయిల్ మంజూరు చేస్తే కేసును పక్కదారి పట్టించే అవకాశం ఉందని సైబర్ క్రైమ్ పోలీసులు న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. ఐబొమ్మ రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నవంబర్ 14 అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.



# కొండగట్టు అంజన్న ఆలయానికి అటవీశాఖ షోకాజ్ నోటీసు...

- కొండగట్టు అంజన్న ఆలయానికి షోకాజ్ నోటీసు
- 6 ఎకరాల అటవీ భూమి ఆక్రమణ ఆరోపణలు
- ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్ కింద నోటీసులు
- భక్తుల్లో ఆగ్రహం.. శాఖల మౌనం



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:** తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రస్తుతం అటవీ శాఖ, దేవాదాయ శాఖ (ఎండోమెంట్) మధ్య కీలక వివాదానికి కేంద్రంగా మారింది. అటవీ శాఖ అధికారులు ఆలయ నిర్వహణ కమిటీకి నేరుగా షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో, భక్తులలో మరియు స్థానికులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అటవీ శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులలో, ఆలయ నిర్వహణ కమిటీ 684 బ్లాక్ అటవీశాఖ పరిధిలోని దాదాపు 6 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారని స్పష్టంగా ఆరోపించారు. ఈ ఆక్రమణ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయని, ఇది అటవీ సంరక్షణ చట్టాలను ఉల్లంఘించడమేనని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఈ ఆరు ఎకరాల విస్తీర్ణంలోనే అన్నదాన సత్రం, వాటర్ ప్లాంట్, వాహన పూజ షెడ్, ఎగ్జిక్యూటివ్ బిల్డింగ్, సాగర్ గెస్ట్ హౌస్, పబ్లిక్ టాయిలెట్స్ వంటి ఆలయానికి సంబంధించిన ముఖ్యమైన కట్టడాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి.

ఈ వ్యవహారంలో అటవీ శాఖ ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్ కింద నోటీసులు జారీ చేసింది. అటవీ భూమిలో నాన్‌ఫారెస్ట్ పనులు చేపట్టడానికి కన్సర్వేషన్ యాక్ట్ 2A ప్రకారం కేంద్ర అటవీ శాఖ అనుమతులు తప్పనిసరి అని నోటీసులో స్పష్టంగా పేర్కొనబడింది. అంతేకాకుండా, ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ కన్సర్వేషన్ యాక్ట్‌లోని 3A మరియు 3B సెక్షన్ల కింద ఈ నోటీసులు ఇవ్వబడ్డాయి. ఈ నోటీసులకు తగిన వివరణ ఇవ్వని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ ఆలయ అధికారులను హెచ్చరించింది.

అయితే, ఇంతటి కీలకమైన అంశంపై ఎండోమెంట్ (దేవాదాయ) శాఖ మరియు అటవీ శాఖ అధికారులు ఇద్దరూ మౌనం వహించడం, ఈ నోటీసుల గోప్యతపై పలు సందేహాలను మరియు అనుమానాలను పెంచుతోంది. శతాబ్దాల నాటి పురాతన ఆలయాన్ని ఇలా టార్గెట్ చేయడంపై భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టు అంజన్న సన్నిధిపై జరిగిన ఈ చర్యను భక్తులు విశ్వాసాలపై దాడిగా అభివర్ణిస్తూ మండిపడుతున్నారు. దేవాదాయ శాఖ వర్సెస్ అటవీ శాఖ మధ్య నెలకొన్న ఈ వివాదం, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# దౌల్తాబాద్ జడ్పీటీసీ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల ఎదురుచూపు

- కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డా వారికే జడ్పీటీసీ ఎంపీపీ టికెట్ ఇవ్వాలి - కార్యకర్తల డిమాండ్
- ప్రజాక్షేత్రంలో గుర్తింపు ఉన్న నాయకుడికే టికెట్ ఇవ్వాలి
- సొంత నిధులతో పార్టీ కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన మాటూర్ హన్మంతు

**కోడంగల్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నందున వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం జడ్పీటీసీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం నాయకులలో టికెట్ ఎవ్వరికి దక్కుతుంది అనే టెన్షన్ మొదలైంది. ఎవ్వరికి వారు జడ్పీటీసీ, ఎంపీపీ టికెట్ దక్కాలని వ్యూహాలు మొదలు పెట్టి ఎవరికీ వారు కార్యకర్తలను నాయకులను కలుస్తున్నారు, కానీ వివిధ గ్రామాలలోని యువత ప్రజలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఒకటే ఒకటే మాట చెప్తున్నారు. కార్యకర్తలకు గాని, ప్రజలకు గాని అపద వచ్చింది అంటే నేను వున్నాను అనే ధర్యం చెప్పే నాయకుడికి ప్రజా క్షేత్రంలో ప్రజలలో గుర్తింపు వుండి అందరిని కలుపుకొని పోయే మనస్త త్వం పార్టీలకు అతీతంగా సొంత నిధులతో మండల కేంద్రంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేసి యువతకు ప్రోత్సహించిన మాటూర్ హన్మంత్ లాంటి నాయకులకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే మండలం ఎంతో అభివృద్ధి చెందుతుంది అని, ఏ అధికారం లేకుండానే తన స్వంత నిధులతో రోడ్డుకు ఇరువైపులా వున్న కంప చెట్ల తొలగింపు రోడ్డుకు మట్టి వేపించడం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ, యువత




క్రీడాలలో రాణించాలని వారికి క్రికెట్ టౌర్నమెంట్ కబడ్డీ టౌర్నమెంట్ లాంటి సేవా కార్యక్రమాలు చేసిన బీసీ నాయకుడిని కాదని, ప్రజలలో గుర్తింపు లేని నాయకులకు పార్టీ టికెట్ ఇస్తే పార్టీకి నష్టం జరుగుతుంది కావున కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీ పెద్దలు ఆలోచించి నిర్ణయం చేసి అధికారం లేకున్నా అభివృద్ధి చేయాలన్నారు. మండలానికి మంచి చేయాలనే ఆశయం ఉన్న వ్యక్తికి టికెట్ ఇస్తారో లేక పార్టీ టికెట్ తెచ్చుతోని అధికారం వస్తే చాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలలో తిరిగే నాయకులకు టికెట్ ఇస్తారో పార్టీ పెద్దలు నిర్ణయం చేయాలని పలు గ్రామాలలోని కార్యకర్తలు, యువత పెద్దమనుషుల ఆలోచన ఇది. టికెట్ ఎవ్వరికి వస్తుంది అని వేచి చూడాలి మరి.

# కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొనాయపల్లి సర్పంచ్ ధనలక్ష్మి రామకృష్ణ

- కొనాయపల్లి గ్రామ అభివృద్ధి సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్
- గ్రామీణాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ
- కొనాయపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సర్పంచ్ ధనలక్ష్మి రామకృష్ణ



**షాద్‌నగర్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

కేశంపేట మండలంలోని కొనాయపల్లి గ్రామ సర్పంచ్‌గా ఇటీవల ఎన్నికైన సొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్య యాదవ్ నేతృత్వంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా ఎన్నికైన ధనలక్ష్మి రామకృష్ణ కు కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొనాయపల్లి గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, గ్రామాభివృద్ధి దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. సర్పంచ్ ధనలక్ష్మి రామకృష్ణ కొనాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామ రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, విద్యుత్ సరఫరా మెరుగుదల, పాఠశాలలు మరియు ఆరోగ్య కేంద్రాల బలోపేతం వంటి అంశాలను వివరించారు. అలాగే వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు సాగునీటి వసతులు కల్పించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలను వేగవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కొనాయపల్లి గ్రామానికి సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సమావేశం అనంతరం సర్పంచ్ ధనలక్ష్మి రామకృష్ణ మాట్లాడుతూ.. కొనాయపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పనిచేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాక్డవత్ హనుమంత్ నాయక్, వార్డు సభ్యులు రంగు నర్సింహులు, గోపు రాము, సొప్పరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## లింగంధన గ్రామ సర్పంచ్ నాగిళ్ల వెంకట్‌కు
# సీనియర్ జర్నలిస్టుల ఘన సన్మానం

- భారీ మెజారిటీతో గెలుపు గర్వకారణం – జర్నలిస్టుల అభినందనలు
- గ్రామాభివృద్ధికి మీడియా అండగా ఉంటుంది: టిడబ్ల్యూజెఎఫ్ నేతల హామీ

**షాద్నగర్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

కేశంపేట మండలం లింగంధన గ్రామ సర్పంచ్‌గా ఇటీవల ఘన విజయం సాధించిన నాగిళ్ల వెంకట్‌ను షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర నాయకులు కేపి, టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్, షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ పాల్గొని వెంకట్‌కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వెంకట్ తమకు ఆత్మీయ మిత్రుడిగా, స్నేహశీలిగా ఎప్పటి నుంచో పరిచయం ఉన్న వ్యక్తి అని, జర్నలిస్టులుగా తమతో కలిసి ప్రయాణం చేసిన వ్యక్తి ఈనాడు గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు. ప్రజల్లో ఉన్న నమ్మకం, అభిమానమే ఈ విజయానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ గ్రామ ప్రజల మన్ననలు పొందాలని, సర్పంచ్ హోదాలో లింగంధన గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పారదర్శక పాలన అందిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిళ్ల వెంకట్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించిన గ్రామ ప్రజలకు, సీనియర్ జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, అందరి సహకారంతో లింగంధన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మీడియా పరంగా జర్నలిస్టులు తనకు వెన్నంటే ఉండి సహాయ సహకారాలు అందిస్తామని వారు భరోసా ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు.



# కూకట్పల్లి జోన్ జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం


- పాల్గొన్న పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ అన్నారు. కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్ పల్లి (పార్ట్), వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ల పరిధిలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కూకట్పల్లి జోన్ జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్, డీసీ గంగాధర్, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్పల్లి (పార్ట్), వివేకానంద నగర్, ఆల్విన్ కాలనీ, హైదర్ నగర్ డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ తో చర్చించడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా



చూడాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని,అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, పనులలో వేగం పెంచాలని, సకాలంలో నిధులు మంజూరు అయ్యేలా చూడాలని, అభివృద్ధి పనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రజలకు సుపరిపాలన, పరిపాలన సౌలభ్యం కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియచేశారు. కానీ కొన్ని డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలను, ఇబ్బందులను పరిగణలోకి తీసుకోని పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చే వినతులను పరిగణలోకి తీసుకొని ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని, అందరికీ ఆమోదయోగ్యమైన డివిజన్లను ఏర్పాటు చేయాలని, ప్రజల నుండి, కాలనీ వాసుల నుండి వచ్చే ప్రతి వినతి పత్రం ను పరిగణలోకి తీసుకోవాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి డివిజన్ల రూపకల్పన చేయాలని అన్నారు. విద్యుత్ విభాగం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం పనులలో వేగం పెంచాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన విద్యుత్ స్తంభాల స్థాన భ్రంశం లో తీసుకోవాల్సిన విధివిధానాలను పాటించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విద్యుత్ అధికారులు కాలనీలో చెట్ల కొమ్మలు తొలగించినపుడు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలియచేసారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న రోడ్డులో విద్యుత్ స్తంభాల స్థాన భ్రంశం పనులు వేగవంతం చేయాలని తెలియజేశారు. బాగ్ అమీర్ పెట్రోల్ బంక్ నుండి హైదర్ నగర్ మహేంద్ర షో రూమ్ వరకు చేపడుతున్న సర్వీస్ రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని, సర్వీస్ రోడ్డు పనులను త్వరితగతిన చెప్పటి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియజేశారు. లేక్ వ్యూ బార్ నుండి నవోదయ కాలనీ మీదుగా ప్రేమ్ సరోవహార్ వరకు లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఈ పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి ఉపశమనం లభిస్తుందని, వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని తెలియజేశారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ, పార్క్ లు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీపడకూడదని, అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ గోవర్ధన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ జీశాన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మొగిలిగిద్ద, కడియాల కుంట, సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులను సన్మానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన బుగ్గ క్రిష్ణ, ఉప సర్పంచ్ లక్ష్మి రాము, కడియాల కుంట గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన మూడవత్ రాజు నాయక్ చౌహన్, ఉప సర్పంచ్ తౌసింగ్, వార్డు సభ్యుల మమతా శ్రీనివాస్, నిహారిక మహేష్, బెరుమాలి రమేష్, కొత్తపేట చందు, డిజె ప్రవీణ్,కుమ్మరి మహేష్, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణ, అనుమరి రాజు, కడియాలకుంట వార్డు సభ్యులు రవీందర్ నాయక్, థౌసింగ్, గోపి, నీలా జ్యోతి, దేవి, ప్రియాంక, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, మాజీ వార్డ్ సభ్యులు చందులాల్, నినావత్ శంకర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుప్పన్ కోట్ తండాను అభివృద్ధి చేస్తా

- కుప్పన్ కోట్ తండా సర్పంచ్ రామ్ శెట్టి

**తాండూరు, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

కుప్పన్ కోట్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తానని నూతనంగా బీఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికైన సర్పంచ్ రామ్ శెట్టి వెల్లడించారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని తాండూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు నారాయణరావు మహారాజ్ నివాసంలో సర్పంచ్ రామ్ శెట్టి తన మిత్రులతో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రోహిత్ మహారాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రోహిత్ మహారాజ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంగా సర్పంచ్ గా ఎన్నుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం మేరకు తండాను అభివృద్ధి చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వార్డులలోని సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. అనంతరం సర్పంచ్ రామ్ శెట్టి మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ నుండి సర్పంచ్ గా గెలిపించిన తండావాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కుప్పన్ కోట్ గ్రామ పరిధిలోని అన్ని వార్డులలోని సమస్యలను విడతలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునీర్, ఖాలీద్, నరేష్ చౌహాన్, పవన్ ఠాకూర్, వడ్డే సాబయ్య, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లి ఉపసర్పంచ్
# కర్నెకోట నరేష్‌కు ఘన సన్మానం

- ఆరెకటిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్వగ్రామంలో వేడుక
- గ్రామాభివృద్ధికి నరేష్ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్ష

**షాద్నగర్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీకి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన ఆరెకటిక ముద్దుబిడ్డ కర్నెకోట నరేష్‌కు మంగళవారం ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఘనంగా సన్మానం నిర్వహించారు. గ్రామ ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో ఉపసర్పంచ్‌గా ఎన్నికైన నరేష్‌ను ఘనంగా సత్కరించడం గ్రామంలో హర్షాతిరేకాలకు దారితీసింది. ఈ సన్మాన కార్యక్రమంలో కానం ఉదయ్ గౌడ్, హకీంకారి సురేందర్ జీ, ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అండేకారి చందాజీ, రాష్ట్ర కోశాధికారి, గ్రామ పెద్దలు, కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉపసర్పంచ్‌గా నరేష్ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా డాక్టర్ కర్నెకోట నాగేష్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి - తెలంగాణ ఆరెకటిక సంఘం (హైదరాబాద్) మాట్లాడుతూ.. నరేష్‌కు తమ సంఘం పూర్తి మద్దతు ఉంటుందని, గ్రామ సంక్షేమానికి ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## కేశంపేట నాయి బ్రాహ్మణ సంఘం
# నూతన పాలకమండలి ఎన్నిక

- అధ్యక్షుడిగా మంగలి రాఘవేందర్, కార్యదర్శులుగా పాండు,సురేందర్ ఎంపిక

**షాద్నగర్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

కేశంపేట నాయి బ్రాహ్మణ సంఘం పాలక మండలి ఎన్నికలు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేశంపేట నాయి బ్రాహ్మణుల సమీక్ష సమావేశంలో సంఘానికి నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘ అధ్యక్షులుగా మంగలి రాఘవేందర్‌ను ఎంపిక చేయగా, ఉపాధ్యక్షులుగా మంగలి మల్లేష్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా మంగలి పాండు, మంగలి సురేందర్ బాధ్యతలు స్వీకరించారు. కోశాధికారులుగా మంగలి మహేష్, మంగలి నవీన్‌లను ఎన్నుకోగా, సమాచార కార్యదర్శులుగా మంగలి శివ, మంగలి శ్రీకాంత్‌లను నియమించారు. అలాగే సంఘ సలహాదారులుగా మంగలి లింగం, మంగలి శంకర్, మంగలి రాములు, మంగలి బాలరాజు, మంగలి యాదయ్య, మంగలి నరసింహ, మంగలి వెంకటయ్య, మంగలి రామచంద్రయ్య, మంగలి రామస్వామి, మంగలి ముత్యాలు, మంగలి వెంకటస్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి సభ్యులు సంఘ ఐక్యతతో పాటు నాయి బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.






# ఇథియోపియా చేరుకున్న ప్రధాని మోడీ..

- **ఘన స్వాగతం పలికిన పీఎం అబియ్ అహ్మద్ అలీ**
- **ఇథియోపియా చేరుకున్న ప్రధాని మోడీ**
- **ఘన స్వాగతం పలికిన పీఎం అబియ్ అహ్మద్ అలీ**
- **2011 తర్వాత భారత ప్రధానమంత్రి ఇథియోపియాను సందర్శించడం ఇదే మొదటిసారి**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో భాగంగా ఇథియోపియాకు చేరుకున్నారు. ఇథియోపియా ప్రధానమంత్రి అబియ్ అహ్మద్ అలీ ప్రత్యేకంగా అడ్డిస్ అబాబా విమానాశ్రయానికి వచ్చి మోడీని హృదయపూర్వకంగా స్వాగతించారు. ఇది రెండు దేశాల మధ్య బలమైన సంబంధాలను సూచిస్తుంది. 2011 తర్వాత భారత ప్రధానమంత్రి ఇథియోపియాను సందర్శించడం ఇదే మొదటిసారి. ప్రధాని మోడీ గౌరవార్థం అడ్డిస్ అబాబా స్వాగత హోర్డింగులు, పోస్టర్లు, భారత జెండాలతో అలంకరించారు.

ఈ రెండు రోజుల సందర్శనలో ప్రధాని మోదీ ఇథియోపియా ప్రధానమంత్రి అబియ్ అహ్మద్‌తో విస్తృత చర్చలు జరుపుతారు. రాజకీయ సహకారం, అభివృద్ధి భాగస్వామ్యం, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి. ఇద్దరు నాయకులు గ్లోబల్ సౌత్‌లో భాగస్వాములుగా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని కట్టుబడి ఉన్నారు. ఆఫ్రికన్ యూనియన్ ప్రధాన కార్యాలయం అడ్డిస్ అబాబాలో ఉండటం వల్ల ఈ సందర్శనకు ప్రాధాన్యత ఉంది. 2023లో భారత G20 అధ్యక్షత్వంలో ఆఫ్రికన్ యూనియన్‌ను శాశ్వత సభ్యత్వం ఇవ్వడం గురించి మోడీ తన విదాయ ప్రకటనలో ప్రస్తావించారు.

ఇథియోపియాలోని భారతీయ డైస్పోరా సభ్యులను కలుసుకోవడం, ఇథియోపియా పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగించడం కూడా మోడీ కార్యక్రమంలో ఉన్నాయి. భారతదేశం ఇథియోపియాకు రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. వ్యవసాయం, ఖనిజాలు, సోలార్ ఎనర్జీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో సహకారం మరింత పెంచాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సందర్శన భారత్‌ఆఫ్రికా సంబంధాలకు కొత్త ఊపిరి పోస్తుంది. మోడీ ఈ పర్యటన తర్వాత ఒమన్‌కు వెళ్లనున్నారు. దీంతో మూడు దేశాల నాలుగు రోజుల పర్యటన పూర్తవుతుంది.



# పోలీసుల అదుపులో మావోయిస్టు నేత బడే?

**జర్నలిస్ట్ డైరీ, తెలంగాణ బ్యూరో:**
మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. మావోయిస్టు అధినేత చొక్కరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈరోజు ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ )లో 15 మంది మావోయిస్టులు పోలీసులకు చిక్కారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్టు సమాచారం.అలాగే వారిలో మావో అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారందనీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి తీసుకు వెళ్లినట్లు సమాచారం.



# తిరుమలలో సుప్రభాత సేవ రద్దు

**జర్నలిస్ట్ డైరీ, తిరుమల:**
తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు.మంగళవారం మధ్యాహ్నం 1:23 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. బుధవారం నుంచి తిరుప్పావై పాశురాలతో శ్రీవారికి మేలుకొలుపు జరుపుతున్నట్లు వివరించారు. ధనుర్మాసం సందర్భంగా మూల విరాట్టుకు బిల్వపత్రాలతో సహస్ర నామార్చన జరిపిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. శ్రీవల్లి పుత్తూరు చిలుకలతో రోజూ స్వామి వారికి అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీవారికి విశేష నైవేద్యాలుగా బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రత్యేక ప్రసాదాలు నివేదన చేస్తున్నట్లు వివరించారు. భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామి వారికి ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు టీటీడీ పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ మీటింగ్ తేదీ మార్పు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేశారు. ఈనెల 19న జరగాల్సిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశాన్ని ఈనెల 21కి వాయిదా వేసినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటించారు. ఈ నెల 19వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం కోసం సమావేశాన్ని వాయిదా వేసుకున్నట్లు తెలిపారు.

# ఇంకెంతకాలం తెలంగాణ గడ్డపై ఆంధ్రా వాళ్ళ పెత్తనం?

ఒక నాడు "ఆంధ్ర రాష్ట్ర" ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుకున్న వెంకయ్య నాయుడుకి , తెలంగాణ మీద ప్రేమ లేదని తెలుసు.ఆయనకే కాదు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ మెదలైన ఆంధ్ర సినిమా హీరోలు కూడా ఆనాటి ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రం కావాలనేదే వాళ్ళ డిమాండ్. వీళ్ళవరికీ తెలంగాణా ప్రాంతం పట్ల కానీ, తెలంగాణ ప్రజల పట్ల గానీ ప్రేమ, గౌరవం లేవు. ఇప్పుడు వెంకయ్య నాయుడు తెలంగాణ వాళ్ళకు సుద్దులు చెపుతున్నాడు "మనం అంతా తెలుగు వాళ్ళం. మన భాష ఒక్కటే... కళాకారులకు ప్రాంతీయ సరిహద్దులు ఉండవు అన్నారు" నిజమే కదా! అలాంటప్పుడు బాలసుబ్రహ్మణ్యం ఎందుకు అందెశ్రీ రాసిన తెలంగాణ రాష్ట్ర గీతం పాడనని తిరస్కరించాడు?. మీ ఆంధ్రా వాళ్ళకు ప్రాంతీయ అభిమానం ఉండొచ్చు. కానీ తెలంగాణ వాళ్ళకు ఉండకూడదు. గతంలో తెలంగాణ భాషను, సంస్కృతిని మీ సినిమాల్లో ఎంత అవహేళన చేశారో మాకు గుర్తు ఉంది. మా భూములు, మా ఉద్యోగాలు, మా నీళ్లు దోచుకున్న దొంగలు మీరు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు విడిపోయే ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రయోజనాల కోసం పార్లమెంటులో మాట్లాడేరే గానీ, మా తెలంగాణా కు దక్కాల్సిన నీళ్ళు, నిధులు గురించి మాట్లాడ లేదు. మీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు మా తెలంగాణా కు చేసిన అన్యాయాలు అనంతం. అవి చరిత్రలో రికార్డు అయ్యాయి. అవి చెరిపేస్తే చెరిగిపోవు. మీ భాషా, యాస వేరు. మా భాషా, యాస వేరు. మీ సంస్కృతి వేరు, మా సంస్కృతి వేరు, మీ పండుగలు , మా పండుగులు వేరు.

బాలసుబ్రహ్మణ్యం కేవలం ఒక కమర్షియల్ సినిమా గాయకుడు. ఆయనకు ప్రాంతీయ అభిమానం ఉండొచ్చు. మాకు ఉండకూడదా ? ఇప్పుడు మీకు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. ఒక నూతన రాజధాని అమరావతి కూడా ఏర్పడుతుంది. అక్కడ మీరు బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టుకోండి. మొత్తం ఆంధ్రప్రదేశ్ లో ఆయన విగ్రహం పెట్టే చోటు లేదా? తేరగా మా రవీంద్రభారతే మీకు అడ్డంగా దొరికిందా? మా తెలంగాణా దివంగత జానపద కళాకారులు, రచయితలు, గాయకుల విగ్రహాలు పెట్టుకొనే అవకాశం లేకుండా మాగడ్డ పై ఇంకా మీ విగ్రహాలేనా?అంతే కాకుండా మా తెలంగాణా ప్రజలకు ఇష్టం లేనప్పుడు బలవంతంగా, పోలీసులు రక్షణలో ఎందుకు మా ఆత్మాభిమానం దెబ్బ తీసేలా ఎందుకు మాపై మీ దౌర్జన్యం ? మా కర్మకాలి రేపు వెంకయ్య నాయుడు పైకి పోయినా...ఆయన విగ్రహాన్ని కూడా మేము ఇక్కడే చూడాలా!? . ఇంకా మా భూములపై,మా వనరులపై ఎంత కాలం మీ కబ్జాల పర్వం?



తెలంగాణ ముఖ్యమంత్రుల కి/ మంత్రులకు రోషం లేదా ?:

తెలంగాణలో సెటిలర్స్ ఓట్ల కోసం, వాళ్ళ ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వం లొంగిపోవటం సిగ్గు చేటు. తెలంగాణ ప్రజలందరూ వ్యతిరేకిస్తూ ఉన్నా ... తెలంగాణ పోరాట యోధులు, ఉద్యమకారులు అడ్డు చెబుతున్నా...మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విధంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని రవీంద్ర భారతి నడిబొడ్డున పెట్టడానికి ఏలా అనుమతించాడు ? రేవంత్ రెడ్డికి మొదటి నుండి తెలంగాణ ఉద్యమం మీద ప్రేమ లేదు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కు పెట్టిన వాడు. ఆయనకు తెలంగాణ పై ప్రేమ ఎందుకు ఉంటుంది ? ఇప్పుడు ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నేతలకు దమ్ము, ధైర్యం లేకపోవడంతో, ముఖ్యమంత్రిగా పనిచేయ గల సత్తా ,నేర్పు లేకపోవటంతో ...తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం లేని రేవంత్ రెడ్డిని తెలంగాణా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షునిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయాల్సిన దుస్థితి కాంగ్రెస్ అధిష్టానానికి పట్టింది. అందుకే తెలంగాణ పరువు, ప్రతిష్ట ఇలా దిగజారింది. కనీసం తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబుకు అంత కన్నా ఇంగితం లేదు. వెంకయ్య నాయుడు పక్కన చేరి, ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని తెలంగాణ గడ్డ నడిబొడ్డున రవీంద్ర భారతిలో ఆవిష్కరించడం సిగ్గుచేటు. తెలంగాణ ఉద్యమకారులను,, విద్యార్థులను, ముందుగానే నిర్బంధించి నిరసన వ్యక్తం చేయకుండా అడ్డుకోవడం అమానుషం. వాళ్ళని అరెస్ట్ చేసి, ఆంధ్ర వాళ్ళ విగ్రహాలు నడిబొడ్డున పెడతారా!? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆంధ్రా వాళ్ళ పెత్తనం సాగినప్పుడు తెలంగాణలో గల్లీ,గల్లీలో ఆంధ్ర నాయకుల విగ్రహాలే పెట్టారు. ట్యాంకు బండ్ పై ఎక్కువ శాతం వాళ్ల విగ్రహాలే ఉన్నాయి.ఇప్పటికీ తెలంగాణ వచ్చి 12 ఏళ్లు అయినా మన దివంగత తెలంగాణ జానపద కళాకారుల,అమర వీరుల పట్ల గాని వీళ్ళకి భక్తి, గౌరవం ఉందా ? వాళ్ల విగ్రహాలు ఆంధ్రప్రదేశ్ లో పెట్టే దమ్ముందా ఈ తెలంగాణ మంత్రులకు ఉందా? ఆంధ్ర వాళ్ళకు అంత విశాల హృదయం ఉందా? ఎంత కాలం అయినా ఆంధ్రా తెలంగాణ భిన్న ధృవాలు. కనీసం తెలంగాణలో అయినా అమర వీరుల విగ్రహాలు

పెట్టాలనే సోయి ఉందా ? ఈ లాంటి తెలంగాణ సోయి లేని చవటలు, రోషం, మీసం లేకుండా ఇప్పుడు తెలంగాణకి నాయకత్వం వహిస్తున్నారు. వీళ్ళకు తెలంగాణ జాతి, భాష, సంస్కృతి పట్ల కూడా వీళ్ళకు అభిమానం లేదు ప్రాంతీయ సోయీ లేదు. వీళ్ళకి ఎంతసేపూ అధికారం లోకి వచ్చి ప్రజలను దోచుకుందామా ,ఆస్తులు సంపాదించుకుందామా, పెత్తనం చేద్దామా, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామా ! అనేదే వీళ్ళ లక్ష్యం తప్ప... తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఉద్యమ లక్ష్యాలు, ఆదర్శాలు ఏమి గుర్తులేదు. మీరు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు?. కెసిఆర్ కూడా తెలంగాణ ఉద్యమ సమయంలో "తెలంగాణ రైతుల భూములను అక్రమంగా లాక్కున్న రామోజీ ఫిలిం సిటీని 1000 నాగాళ్లతో దున్ని స్తాను" అని ప్రగల్భాలు పలికాడు. కానీ ఆచరణలో రామోజీ ఫిలిం సిటీని చూడగానే... రామోజీరావుకు సాగిలపడి ...ఆయన పత్రిక "ఈనాడు" కి భయపడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని వెనక్కి తీసుకున్నాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా ఆంధ్రా హీరోల సినిమాలకు రేట్లు పెంచనని, అదనపు షోలు వేయడానికి అనుమతి ఇవ్వనని శాసనసభలో ప్రకటించి... చివరికి ఆంధ్ర సినిమాల హీరోల ప్రభావానికి... లాబీకీ లొంగి పోయి మళ్ళీ సినిమా టికెట్ల రేట్లు పెంచుకోవడానికి అవకాశం ఇచ్చాడు. అంటే తెలంగాణ ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ ప్రజలకు ఇచ్చినటువంటి మాటలను నిలుపుకునే శక్తి, దమ్ము , ధైర్యం,జ్ఞానం లేదు అని అర్థమవుతుంది. ఇంకెంత కాలం ఆంధ్ర వాళ్ళకి ఊడిగం చేస్తూ బానిస బ్రతుకుతారు ? మీకంటూ ఒక వ్యక్తిత్వం , ఆత్మ గౌరవం, ఒక ప్రాంతీయ స్పృహ , అభిమానం ఉండదా !? అని తెలంగాణ ప్రజలు, తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని, ఇతర తెలంగాణ మంత్రులను సూటిగా

ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో పేరుపడ్డ దివంగత జానపద కళాకారులు, రచయితలు, గాయకులు ఎదరో ఉండగా వారి విగ్రహాలు పెట్టడానికి రవీంద్ర భారతిని ఉపయోగించుకోవాలి.అంతే కానీ, ఇంకా ఆంధ్ర నాయకుల కళాకారుల విగ్రహాలకు తెలంగాణలో చోటు ఇవ్వడం ఏమిటి? అమరావతి గొడ్డు పోయిందా ? ఆంధ్రప్రదేశ్ లో బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని పెట్టడానికి మూడు అడుగుల జాగా లేక పోయిందా? ఇంకా.. ఎంతకాలం.. మా తెలంగాణపై ..మా రాజధానిపై ఆంధ్రా వాళ్ళ అడ్డా కొనసాగుతుంది ? వాళ్ళ కబ్జాల పర్వం కొనసాగుతుంది ? ఇకనైనా వెంటనే ఆంధ్ర వాళ్ళ కబ్జా భూములను వెనక్కి తీసుకోవాలి. సినిమా స్టూడియోల కోసం, ఇతర ఫిలిం డెవలప్మెంట్ సంస్థల కోసం తెలంగాణ భూములను కారుచౌకగా, రాయితీ రేట్లకు తీసుకున్న నిర్మాతలు, హీరోలు, దర్శకులు సినిమా స్టూడియోలు కట్టకుండా ఇప్పుడు ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ దందా చేస్తూ కమర్షియల్ గా వాళ్ళు భూములపై డబ్బులు సంపాదిస్తూ ఉంటే , చట్ట ప్రకారం ఆ భూముల్ని వెనక్కి తీసుకునే అధికారం ఉండి కూడా మన తెలంగాణ మంత్రులు, ముఖ్యమంత్రులు తెల్ల మొఖాలు వేసుకొని చోద్యం చూస్తున్నారు. అన్ని విషయాల్లో వెనకడుగు వేస్తున్నారు .అదే పేదవాళ్లు 100 గజాలు ఇంటి కోసం జాగా తీసుకుంటే వాళ్ల ఇళ్లను కూల్చడానికి బుల్డోజర్ తో హైడ్రా బయలుదేరి వాళ్ళ గుడెశెలు కూలుస్తారు . ఇదే నా ఈ తెలంగాణ మంత్రులు పేద ప్రజలకు చేసే సేవ.

రామోజీ ఫిలిం సిటీని ఎప్పుడు స్వాధీనం చేసుకుని ఆ భూములను సంబంధిత గ్రామ రైతులకు ఎప్పుడు అప్పగిస్తారో తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలి. స్టూడియోలో నిర్మాణం కోసం భూములు తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే నిర్మాతలు దర్శకుల భూములను వెనక్కి తీసుకోవాలి. వాళ్ల సినిమాలకు రేట్లు పెంచుకునే హక్కును కానీ, స్పెషల్ షోలు వేసే హక్కులను కానీ ఇవ్వకూడదు .హైకోర్టు ఒకవైపు చివాట్లు పెడుతున్న ఖాతరు చేయకుండా ఆంధ్ర హీరోల లాభికి సాగిల పడే తెలంగాణ నాయకులు సిగ్గుపడాలి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

SV6 NEWS
సమగ్ర సమాచార వారధి
SV6 దైవమ్
ఆధ్యాత్మిక వారధి
24/7 SV6 NEWS
మరియు
ఆధ్యాత్మిక వారధి SV6దైవమ్ యూట్యూబ్
ప్రసారాలు అనునిత్యం మీకోసం

# అప్పడూ.. ఇప్పడూ.. ఎప్పడూ.. అంజన్నే మన నాయకుడు

- వచ్చే ఎన్నికల్లో అంజన్న నాయకత్వంలో గులాబీ జెండా ఎగరటం ఖాయం
- కొత్త సర్పంచ్ ల అభినందన కార్యక్రమంలో కేటీఆర్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

షాద్ నగర్ లో పార్టీ పుట్టినప్పటి నుంచి పార్టీలోనే ఉన్నాడు.. పార్టీని వెక్కిరించే రోజుల్లో జడ్పిటిసిగా గెలిచాడు.. ఉద్యమాలలో ప్రాణం పెట్టి పోరాడాడు.. ఎమ్మెల్యేగా రెండుసార్లు ఘనవిజయాలు సాధించాడు.. ఎప్పటికీ అంజన్నే మీ నాయకుడు.. అంజన్న వెంట ఉండండి.. ఐక్యంగా పోరాడండి.. అంటూ మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన 65 మంది సర్పంచులతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఆయన కుమారుడు మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ లు రాజధానికి వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంజయ్య యాదవ్ తనకు తండ్రితో సమానమని అన్నారు. రాష్ట్రంలోనే అంజయ్య యాదవ్ లాంటి మంచి వ్యక్తి లేడని కొనియాడారు. చీమకు కూడా హాని చేయని అలాంటి వ్యక్తి ఎదుటి వాళ్లపై అక్రమ కేసులు పెట్టడం కానీ, అవినీతికి పాల్పడడం గాని, తప్పుడు మాటలు మాట్లాడడం కానీ చేయలేదని అన్నారు. ఆయనను చాలా దగ్గర నుంచి చూసానని చాలా గొప్ప వ్యక్తిత్వం అని ప్రశంసించారు. నియోజకవర్గాన్ని గత 10 ఏళ్లలో ఎంతగానో అభివృద్ధి చేశారని అన్నారు. ప్రభుత్వ పథకాలు అన్నిటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులందరికీ అందేలా కృషి చేశారని పేర్కొన్నారు. అతని నోటి వెంట ఒక పొల్లు మాట కూడా రాదని, ఇంత మంచి మనిషి ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు తెలంగాణలో కూడా వెతికిన దొరకడని కేటీఆర్ ప్రశంసించడం విశేషం. అలాంటి వ్యక్తి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడానికి కారణం కేవలం పార్టీలో నాయకుల మధ్య ఐక్యత లేకపోవడమేనని తెలిపారు. ఇకనైనా ఐక్యతగా పనిచేసే రాబోయే ఎన్నికల్లో అంజయ్య యాదవ్ ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఆయన ఆధ్వర్యంలోనే గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు.

**ఇలా అనేశాడు ఏంటి..?**

మాజీ మంత్రి కేటీఆర్ వాఖ్యలు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గంలో కలకలం రేపుతున్నాయి. ఇటీవల సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మధ్య జరిగిన వివాదం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో అంజయ్య యాదవ్ పై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నేరుగా విరుచుకుపడడం కూడా మనం చూశాం. ఒకవైపు రానున్న కాలంలో ఎమ్మెల్యేగా టికెట్ పొందేది ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాత్రమేనని ఆయన వర్గం ప్రచారం చేసుకుంటుంది. అలాంటి దశలో మాజీ మంత్రి కేసీఆర్ అంజయ్య యాదవ్ గురించి ఇలా మాట్లాడటం, ఆయనే నియోజకవర్గ నాయకుడని ప్రకటించడం అవతలి వర్గాల్లో కలకలం రేపుతుంది. అయితే అంజయ్య యాదవ్ ని పొగుడుతున్నంతసేపు అక్కడున్న సర్పంచులు, నాయకులు హర్షద్వానాలు వ్యక్తం చేయడం విశేషం. ప్రస్తుతం కేటీఆర్ చేసిన సంచలన వ్యాఖ్యలు ఒక వర్గం గుండెల్లో గుబులు రేపుతున్నాయి అనడంలో ఇలాంటి సందేహం లేదు. ప్రస్తుతం రాజకీయంగా ఇది చర్చనీయాంశంగా మారుతోంది.





# 'పరకామణి 'చోరీ పై హైకోర్టు విచారణ

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

తిరుమల పరకామణి చోరీ కేసుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ కేసు పై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు పలు కీలక సూచనలు చేసింది. తిరుమల శ్రీవారి పరకామణిలో జరిగే చోరీలను సాధారణ దొంగతనంగా చూడటానికి వీల్లేదని స్పష్టం చేసింది ఏపీ హైకోర్టు.కానుకల రూపేణా వచ్చిన సొమ్ము చోరీకి గురయితే కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని హైకోర్టు తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియను ఆధునీకీకరించాల్సిన అవసరముందని వెల్లడించింది. మానవ ప్రమేయాన్ని తగ్గించి.. యంత్రాలు, ఏఐ టెక్నాలజీని వినియోగించాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సూచించింది. టీటీడీలో ఇలాంటి చోరీ ఘటనలు జరుగుతున్నా కానుకలు లెక్కించేందుకు అదే పాత విధానాన్ని అనుసరించడం సరికాదని స్పష్టం చేసింది న్యాయస్థానం.కానుకల లెక్కింపునకు సేవాభావంతో వచ్చిన భక్తులను దుస్తులు లేకుండా సోదాలు చేయడం, దొంగల్లా అవమానించడం తగదని పేర్కొంది. కానుకలు లెక్కింపునకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలని సూచించింది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల న్యాయవాదులకు ఏపీ హైకోర్టు పలు సూచనలు చేసింది.

# ఏసీబీకి చిక్కిన ఓయూ బిల్డింగ్ డివిజన్ డిఈ శ్రీనివాసులు

**హైదరాబాద్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

ఓ కాంట్రాక్టర్ వద్ద బిల్లు చెల్లింపుల కోసం డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ లంచం అడగడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని తార్నాకలోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉస్మానియా యూనివర్సిటీ బిల్డింగ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయిన నిందితుడు రాకొండ శ్రీనివాసులు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని మానేరు బాలుర హాస్టల్‌లో ఫిర్యాదుదారుడు అమలు చేసిన పునరుద్ధరణ పనులకు సంబంధించి రూ.7,37,034 బిల్లులను విడుదల చేసినందుకు, ఓయూ క్యాంపస్‌లో భవిష్యత్తులో జరిగే కాంట్రాక్ట్ పనులకు ఎటువంటి అడ్డంకులు కలిగించనందుకు రూ.11 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో గతంలో రూ.5 వేలు ఇచ్చిన బాధితుడు రూ.6 వేల పాక్షిక చెల్లింపుకు అంగీకరించారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ మేరకు నాంపల్లి



ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

# ముగిసిన ఐపీఎల్ వేలం..

- సోల్డ్, అన్‌సోల్డ్ ప్లేయర్స్ లిస్ట్ ఇదే
- 48 మంది భారతీయులు, 29 మంది విదేశీ ప్లేయర్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మినీ వేలం ముగిసింది. వేలంలో 77 మంది ఆటగాళ్లు అమ్ముడయ్యారు. వేలంలో అమ్ముడైన ఆటగాళ్లలో 48 మంది భారతీయులు, 29 మంది విదేశీ ప్లేయర్స్ ఉన్నారు. వేలంలో 10 ఫ్రాంచైజీలు మొత్తం రూ.215.45 కోట్లు ఖర్చు చేశాయి. ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.25.20 కోట్లకు అతడిని కొనుగోలు చేసింది. సోల్డ్, అన్‌సోల్డ్ ప్లేయర్స్ లిస్ట్ ఓసారి చూద్దాం.

**అమ్ముడుపోయిన ప్లేయర్స్ లిస్ట్:**

**బ్యాటర్లు:**

డేవిడ్ మిల్లర్ - 2 కోట్లు - 2 కోట్లు - ఢిల్లీ క్యాపిటల్స్
కామెరాన్ గ్రీన్ - 2 కోట్లు - 25.20 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
పాతుమ్ నిస్సాంక - 75 లక్షలు - 4 కోట్లు - ఢిల్లీ క్యాపిటల్స్
రాహుల్ త్రిపాఠి - 75 లక్షలు - 75 లక్షలు - కోల్‌కతా నైట్ రైడర్స్
డానిష్ మలేవార్ - 30 లక్షలు - 30 లక్షలు - ముంబై ఇండియన్స్
అక్షత్ రఘువంశీ - 30 లక్షలు - 2.2 కోట్లు - లక్నో సూపర్ జెయింట్స్
సర్ఫరాజ్ ఖాన్ - 75 లక్షలు - 75 లక్షలు - చెన్నై సూపర్ కింగ్స్
అమన్ రావ్ - 30 లక్షలు - 30 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
సాహిల్ పరాఖ్ - 30 లక్షలు - 30 లక్షలు - ఢిల్లీ క్యాపిటల్స్
పృథ్వీ షా - 75 లక్షలు - 75 లక్షలు - ఢిల్లీ క్యాపిటల్స్
విహాన్ మల్హోత్రా - 30 లక్షలు - 30 లక్షలు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

**బౌలర్లు:**

జాకబ్ డఫీ - 2 కోట్లు - 2 కోట్లు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
మతీషా పతిరణ - 2 కోట్లు - 18 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
అన్రిచ్ నార్ట్జే - 2 కోట్లు - 2 కోట్లు - లక్నో సూపర్ జెయింట్స్
రవి బిష్ణోయ్ - 2 కోట్లు - 7.2 కోట్లు - రాజస్థాన్ రాయల్స్
అకేల్ హోసేన్ - 2 కోట్లు - 2 కోట్లు - చెన్నై సూపర్ కింగ్స్
అశోక్ శర్మ - 30 లక్షలు - 90 లక్షలు - గుజరాత్ టైటాన్స్
కార్తీక్ త్యాగి - 30 లక్షలు - 30 లక్షలు - కోల్‌కతా నైట్ రైడర్స్
నమన్ తివారీ - 30 లక్షలు - 1 కోటి - లక్నో సూపర్ జెయింట్స్
సుశాంత్ మిశ్రా - 30 లక్షలు - 90 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
యశ్ రాజ్ పుంజా - 30 లక్షలు - 30 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
ప్రశాంత్ సోలంకి - 30 లక్షలు - 30 లక్షలు - కోల్‌కతా నైట్ రైడర్స్
విఘ్నేష్ పుత్తూరు - 30 లక్షలు - 30 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
ముస్తాఫిజుర్ రెహమాన్ - 2 కోట్లు - 9.2 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
సాకిబ్ హుస్సేన్ - 30 లక్షలు - 30 లక్షలు - సన్‌రైజర్స్ హైదరాబాద్
మహ్మద్ ఇజార్ - 30 లక్షలు - 30 లక్షలు - ముంబై ఇండియన్స్
ఓంకార్ తర్మలే - 30 లక్షలు - 30 లక్షలు - సన్‌రైజర్స్ హైదరాబాద్
అమిత్ కుమార్ - 30 లక్షలు - 30 లక్షలు - సన్ రైజర్స్ హైదరాబాద్
అథర్వ అంకోలేకర్ - 30 లక్షలు - 30 లక్షలు - ముంబై ఇండియన్స్
ప్రఫుల్ హింగే - 30 లక్షలు - 30 లక్షలు - సన్‌రైజర్స్ హైదరాబాద్
ఆకాష్ దీప్ - 1 కోటి - 1 కోటి - కోల్‌కతా నైట్ రైడర్స్
మాట్ హెన్రీ - 2 కోట్లు - 2 కోట్లు - చెన్నై సూపర్ కింగ్స్
శివమ్ మావి - 75 లక్షలు - 75 లక్షలు - సన్‌రైజర్స్ హైదరాబాద్
రాహుల్ చాహర్ - 1 కోటి - 5.2 కోట్లు - చెన్నై సూపర్ కింగ్స్
లుంగి ఎన్‌గిడి - 2 కోట్లు - 2 కోట్లు - ఢిల్లీ క్యాపిటల్స్
ప్రవీణ్ దూబే - 30 లక్షలు - 30 లక్షలు - పంజాబ్ కింగ్స్
విశాల్ నిషాద్ - 30 లక్షలు - 30 లక్షలు - పంజాబ్ కింగ్స్
బ్రిజేష్ శర్మ - 30 లక్షలు - 30 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
ఆడమ్ మిల్నే - 2 కోట్లు - 2.4 కోట్లు - రాజస్థాన్ రాయల్స్
కుల్దీప్ సేన్ - 75 లక్షలు - 75 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
పృథ్వీ రాజ్ యర్రా - 30 లక్షలు - 30 లక్షలు - గుజరాత్ టైటాన్స్
ల్యూక్ వుడ్ - 75 లక్షలు - 75 లక్షలు - గుజరాత్ టైటాన్స్
కైల్ జేమీసన్ - 2 కోట్లు - 2 కోట్లు - ఢిల్లీ క్యాపిటల్స్

**ఆల్‌రౌండర్‌లు:**

వనిందు హసరంగా - 2 కోట్లు - 2 కోట్లు - లక్నో సూపర్ జెయింట్స్
వెంకటేష్ అయ్యర్ - 2 కోట్లు - 7 కోట్లు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
ఔకిబ్ దార్ - 30 లక్షలు - 8.4 కోట్లు - ఢిల్లీ క్యాపిటల్స్
ప్రశాంత్ వీర్ - 30 లక్షలు - 14.20 కోట్లు - చెన్నై సూపర్ కింగ్స్
శివంగ్ కుమార్ - 30 లక్షలు - 30 లక్షలు - సన్‌రైజర్స్ హైదరాబాద్
జాసన్ హోల్డర్ - 2 కోట్లు - 7 కోట్లు - గుజరాత్ టైటాన్స్
మాథ్యూ షార్ట్ - 1.5 కోట్లు - 1.5 కోట్లు - చెన్నై సూపర్ కింగ్స్
సాత్విక్ దేస్వాల్ - 30 లక్షలు - 30 లక్షలు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
అమన్ ఖాన్ - 30 లక్షలు - 40 లక్షలు - చెన్నై సూపర్ కింగ్స్
మంగేష్ యాదవ్ - 30 లక్షలు - 5.20 కోట్లు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
కూపర్ కొన్నాలీ - 2 కోట్లు - 3 కోట్లు - పంజాబ్ కింగ్స్
క్రెయిన్స్ ఫులేట్రా - 30 లక్షలు - 30 లక్షలు - సన్‌రైజర్స్ హైదరాబాద్
సార్థక్ రంజన్ - 30 లక్షలు - 30 లక్షలు - కోల్‌కతా నైట్ రైడర్స్
దక్ష్ కమ్రా - 30 లక్షలు - 30 లక్షలు - కోల్‌కతా నైట్ రైడర్స్
లియామ్ లివింగ్‌స్టోన్ - 2 కోట్లు - 13 కోట్లు - సన్‌రైజర్స్ హైదరాబాద్
రచిన్ రవీంద్ర - 2 కోట్లు - 2 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
బెన్ ద్వార్షుయిస్ - 1 కోటి - 4.4 కోట్లు - పంజాబ్ కింగ్స్
మయాంక్ రావత్ - 30 లక్షలు - 30 లక్షలు - ముంబై ఇండియన్స్
జాక్ ఎడ్వర్డ్స్ - 50 లక్షలు - 3 కోట్లు - సన్‌రైజర్స్ హైదరాబాద్
జాక్ ఫౌల్క్స్ - 75 లక్షలు - 75 లక్షలు - చెన్నై సూపర్ కింగ్స్
విక్కీ ఓస్త్వాల్ - 30 లక్షలు - 30 లక్షలు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
కనిష్క్ చౌహాన్ - 30 లక్షలు - 30 లక్షలు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

**వికెట్ కీపర్స్:**

క్వింటన్ డి కాక్ - 1 కోటి - 1 కోటి - ముంబై ఇండియన్స్
బెన్ డకెట్ - 2 కోట్లు - 2 కోట్లు - ఢిల్లీ క్యాపిటల్స్
ఫిన్ అలెన్ - 2 కోట్లు - 2 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
కార్తీక్ శర్మ - 30 లక్షలు - 14.20 కోట్లు - చెన్నై సూపర్ కింగ్స్
ముకుల్ చౌదరి - 30 లక్షలు - 2.6 కోట్లు - లక్నో సూపర్ జెయింట్స్
తేజస్వి సింగ్ - 30 లక్షలు - 3 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
టిమ్ సీఫెర్ట్ - 1.5 కోట్లు - 1.5 కోట్లు - కోల్‌కతా నైట్ రైడర్స్
సలీల్ అరోరా - 30 లక్షలు - 1.5 కోట్లు - సన్‌రైజర్స్ హైదరాబాద్
రవి సింగ్ - 30 లక్షలు - 95 లక్షలు - రాజస్థాన్ రాయల్స్
జోర్డాన్ కాక్స్ - 75 లక్షలు - 75 లక్షలు - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
జోష్ ఇంగ్లిస్ - 2 కోట్లు - 8.6 కోట్లు - లక్నో సూపర్ జెయింట్స్
టామ్ బాంటన్ - 2 కోట్లు - 2 కోట్లు - గుజరాత్ టైటాన్స్

**అన్‌సోల్డ్ జాబితా:**

బ్యాటర్లు:

జేక్ ఫ్రేజర్‌మెక్‌గర్క్ - 2 కోట్లు
డెవాన్ కాన్వే - 2 కోట్లు
అథర్వ తైదే - 30 లక్షలు
అన్మోల్‌ప్రీత్ సింగ్ - 30 లక్షలు
అభినవ్ తేజ్రానా - 30 లక్షలు
అభినవ్ మనోహర్ - 30 లక్షలు
యష్ ధుల్ - 30 లక్షలు
ఆర్య దేశాయ్ - 30 లక్షలు
సెడిఖుల్లా అటల్ - 75 లక్షలు
సల్మాన్ నిజార్ - 30 లక్షలు
ధీరజ్ కుమార్ - 30 లక్షలు
చింతల్ గాంధీ - 30 లక్షలు
డేనియల్ లాటెగాన్ - 30 లక్షలు
మనన్ వోహ్రా - 30 లక్షలు
స్వస్తిక్ చికారా - 30 లక్షలు

**బౌలర్లు:**

గెరాల్డ్ కోయెట్జీ - 2 కోట్లు
స్పెన్సర్ జాన్సన్ - 1.5 కోట్లు
ఫజల్హక్ ఫరూఖీ - 1 కోటి
మహేశ్ తీక్షణ - 2 కోట్లు
ముజీబ్ ఉర్ రెహమాన్ - 2 కోట్లు
రాజ్ లింబానీ - 30 లక్షలు
సిమర్‌జీత్ సింగ్ - 30 లక్షలు
ఆకాష్ మధ్వల్ - 30 లక్షలు
వహిదుల్లా జద్రాన్ - 30 లక్షలు
శివం శుక్లా - 30 లక్షలు
కర్ణ్ శర్మ - 50 లక్షలు
కార్తికేయ సింగ్ - 30 లక్షలు
చేతన్ సకారియా - 75 లక్షలు
వకార్ సలాంఖీల్ - 1 కోటి
కెఎం ఆసిఫ్ - 40 లక్షలు
మురుగన్ అశ్విన్ - 30 లక్షలు
తేజస్ బరోకా - 30 లక్షలు
కెసి కరియప్ప - 30 లక్షలు
మోహిత్ రాథీ - 30 లక్షలు
తస్కిన్ అహ్మద్ - 75 లక్ష
రిచర్డ్ గ్లీసన్ - 75 లక్షలు
అల్జారీ జోసెఫ్ - 2 కోట్లు
రిలే మెరెడిత్ - 1.5 కోట్లు
ఝే రిచర్డ్‌సన్ - 1.5 కోట్లు
ఇర్ఫాన్ ఉమైర్ - 30 లక్షలు
మయాంక్ దాగర్ - 30 లక్షలు
జిక్కు బ్రైట్ - 30 లక్షలు
ఇజాజ్ సవారియా - 30 లక్షలు
మనీ గ్రేవాల్ - 30 లక్షలు
ఆర్ఎస్ అంబరీష్ - 30 లక్షలు

**ఆల్ రౌండర్లు:**

గస్ అట్కిన్సన్ - 2 కోట్లు
వియాన్ ముల్డర్ - 1 కోటి
దీపక్ హుడా - 75 లక్షలు
విజయ్ శంకర్ - 30 లక్షలు
రాజవర్ధన్ హంగర్గేకర్ - 40 లక్షలు
మహిపాల్ లోమ్రోర్ - 50 లక్షలు
ఈడెన్ టామ్ - 30 లక్షలు
తనుష్ కోటియన్ - 30 లక్షలు
కమలేష్ నాగరకోటి - 30 లక్షలు
సన్వీర్ సింగ్ - 30 లక్షలు
సీన్ అబాట్ - 2 కోట్లు
మైఖేల్ బ్రేస్‌వెల్ - 2 కోట్లు
డారిల్ మిచెల్ - 2 కోట్లు
దసున్ షనక - 75 లక్షలు
డాన్ లారెన్స్ - 2 కోట్లు
తనయ్ త్యాగరాజన్ - 30 లక్షలు
నాథన్ స్మిత్ - 75 లక్షలు
కరణ్ లాల్ - 30 లక్షలు
ఉత్కర్ష్ సింగ్ - 30 లక్షలు
ఆయుష్ వర్తక్ - 30 లక్షలు
మణిశంకర్ మురాసింగ్ - 30 లక్షలు
మెక్నీల్ నోరోన్హా - 30 లక్షలు
సిద్ధార్థ్ యాదవ్ - 30 లక్షలు
రితిక్ తడా - 30 లక్షలు
చామ మిలింద్ - 30 లక్షలు
విలియం సదర్లాండ్ - 1 కోటి

**వికెట్ కీపర్లు:**

కెఎస్ భరత్ - 75 లక్షలు
రహ్మానుల్లా గుర్బాజ్ - 1.5 కోట్లు
జానీ బెయిర్‌స్టో - 1 కోటి
జామీ స్మిత్ - 2 కోట్లు
రుచిత్ అహిర్ - 30 లక్షలు
వంశ్ బేడీ - 30 లక్షలు
తుషార్ రహేజా - 30 లక్షలు
కానర్ ఎస్టర్‌హుజెన్ - 30 లక్షలు





# చింతకుంటపల్లి గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహకారం - మాజీ మంత్రి కేటీఆర్

- సర్పంచ్ రమేష్ యాదవ్, ఉపసర్పంచ్ సంధ్య శ్రీకాంత్‌కు కేటీఆర్ ఘన సన్మానం

**షాద్‌నగర్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

చింతకుంటపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు తాను సంపూర్ణ సహకారం అందిస్తానని మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేశంపేట మండలం పరిధిలోని చింతకుంటపల్లి గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, ఉపసర్పంచ్ జిన్నారం సంధ్య శ్రీకాంత్‌లను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో స్థానిక ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. అనంతరం ఉపసర్పంచ్ సంధ్య శ్రీకాంత్ కుమార్తెను కేటీఆర్ ముద్దుగా ఎత్తుకొని ఆశీర్వదిస్తూ, ఉన్నతమైన విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించి కుటుంబానికి, సమాజానికి గర్వకారణంగా నిలవాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతకుంటపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నూతన సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్‌కు సూరం కుటుంబ సభ్యుల ఘన సన్మానం

- గ్రామాభివృద్ధిపై ఆశలు – ప్రజాప్రతినిధులకు అభినందనలు
- కలిసికట్టుగా పాలనకు మద్దతు: సూరం కుటుంబ సభ్యుల భరోసా

**షాద్నగర్, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన పల్లె ఆనంద్ కుమార్ ను సూరం కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు పాల్గొనగా, వారిని సైతం శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూరం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ఆనంద్ కుమార్ ప్రజాసేవనే లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సర్పంచ్ హోదాలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. నూతన సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించిన గ్రామ ప్రజలకు, సూరం కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. వార్డు సభ్యుల సహకారంతో పారదర్శక పాలన అందిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమం గ్రామంలో ఐక్యతను పెంపొందించిందని, ప్రజాప్రతినిధులకు ప్రజల మద్దతు ఎంతగానో ఉందని ఈ సందర్భంగా హాజరైన వారు అభిప్రాయపడ్డారు.

# వశిష్ట జూనియర్ కాలేజ్‌లో మహిళల భద్రతపై ఎస్సై మౌనిక అవగాహన కార్యక్రమం

**పెద్దాపురం, డిసెంబర్ 16 (జర్నలిస్ట్ డైరీ) :**

పెద్దాపురం వశిష్ట జూనియర్ కాలేజ్‌లో మంగళవారం మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం పోలీస్ స్టేషన్ ఎస్సై మౌనిక పాల్గొని విద్యార్థినీలకు పలు భద్రతా సూచనలు చేశారు. విద్యార్థినీలు తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.





# చంద్రబాబు పాలనలో ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టింది

- **చంద్రబాబు పాలనలో ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టింది**
- **అభివృద్ధిలో చంద్రబాబు, లోకేష్ ఏపీని పరుగులు పెట్టిస్తున్నారు**
- **విశాఖలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్య**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

చంద్రబాబు పాలనలో ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. విశాఖలో జీఎంఆర్, మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యూ సిటీ ఒప్పంద కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు పాల్గొని మాట్లాడారు. ఇన్నేళ్లుగా వెనుకబడిందని చెప్పుకుంటూ వచ్చిన ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు ఎన్టీఆర్ గుర్తింపు తెస్తే.. అభివృద్ధి మాత్రం చంద్రబాబు హయాంలో జరుగుతోందని చెప్పారు. అభివృద్ధి ప్రణాళి కల అమల్లో చంద్రబాబే నిద్రపోనివ్వరంటే.. ఇప్పుడు లోకేష్ అసలే పడుకోనివ్వడం లేదన్నారు. పార్టీలు.. రాజకీయాల కోసం అభివృద్ధిని అడ్డుకోవడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. రూ.10 వేలు డొనేషన్ ఇచ్చి లక్ష రూపాయల పబ్లిసిటీ చేసుకునే రోజుల్లోనూ నానో కారులో తిరుగుతూ సింపుల్‌గా ఉండే నాయకుడు అశోక్‌గజపతిరాజు అని కొనియాడారు.



# టీటీడీ కీలక నిర్ణయాలు... అర్చకుల వేతనం రూ.45 వేలకు పెంపు

- **తిరుపతిలో 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణం**
- **అర్చకులు, ఇతర సిబ్బంది వేతనాల్లో భారీ పెంపు**
- **ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయానికి ఆమోదం**
- **టీటీడీ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాసులు, మధ్యాహ్న భోజన పథకం**
- **రథాలు, ధ్వజస్తంభాల కోసం 100 ఎకరాల్లో దివ్య వృక్షాల పెంపకం**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి భక్తుల సౌకర్యం, సంస్థాగత బలోపేతం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తిరుపతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించాలని, ముంబైలోని బాంద్రాలో శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపారు.

సమావేశం అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం తిరుపతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ప్లానింగ్, ఆర్కిటెక్ట్ నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అదేవిధంగా, ముంబై బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లోని ధ్వజస్తంభాలు, రథాల తయారీకి అవసరమైన కలప కోసం పలమనేరులో 100 ఎకరాల్లో దివ్య వృక్షాలను పెంచే ప్రతిపాదనకు కూడా ఆమోదముద్ర వేశారు.

### ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

ఈ సమావేశంలో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62 మంది అర్చకులు, పరిచారకులు, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్ల వేతనాలను గణనీయంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం అర్చకుల వేతనాన్ని రూ.25 వేల నుంచి రూ.45 వేలకు, పరిచారకులకు రూ.23,140 నుంచి రూ.30,000కు పెంచారు. పోటు వర్కర్లకు, ప్రసాదం పంపిణీ సిబ్బందికి కూడా వేతనాన్ని రూ.30,000కు పెంచుతూ తీర్మానించారు. శ్రీవారి ఆలయంలో ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టు భర్తీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### విద్య, వైద్య రంగాలకు ప్రోత్సాహం

విద్యా, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పాలకమండలి ఆమోదం తెలిపింది. తిరుపతి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాల కోసం అదనంగా రూ.48 కోట్లు కేటాయించారు. టీటీడీ ఆధ్వర్యంలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు, ఎస్వీ జూనియర్, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలల్లో డేస్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టుల భర్తీకి, శ్రీవారి పోటులో 18 సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని తీర్మానించారు. తిరుమలలోని రహదారులు, కూడళ్లకు వైష్ణవ పురాణాలు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలను పెట్టేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. తలకోనలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.14.10 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయాలన్నీ భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, టీటీడీని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడతాయని ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

# కానిస్టేబుళ్ల నియామకం.. కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం: పవన్

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

కానిస్టేబుళ్ల నియామకం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుళ్లుగా ఎంపికైన 5,757 మంది అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో పాల్గొని పవన్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని న్యాయపరమైన చిక్కుల్ని పరిష్కరించి కానిస్టేబుళ్ల నియామకం పూర్తి చేసిందని చెప్పారు. ఖాకీ దుస్తుల గౌరవాన్ని నిలబెట్టాలని కానిస్టేబుళ్లకు హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి పోలీసు అధికారుల్ని బెదిరిస్తున్నారని, అలాంటి బెదిరింపులను కూటమి ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

### వారి కల సాకారమైంది: హోం మంత్రి అనిత

కానిస్టేబుల్ అభ్యర్థుల నాలుగేళ్ల కల ఇవాళ సాకారమైందని హోంమంత్రి అనిత అన్నారు. ఈ నియామకాలపై కోర్టులో కేసులు వేశారని, వాటిని పరిష్కరించుకొని ఇవాళ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పోలీసు శాఖలో టెక్నాలజీని సీఎం చంద్రబాబే తీసుకొచ్చారని చెప్పారు. ప్రజా భద్రతే ప్రగతికి పునాది అని, రాష్ట్రాభివృద్ధి శాంతిభద్రతలపైనే ఆధారపడి ఉందని ముఖ్యమంత్రి విశ్వసించారని తెలిపారు.

# ఇళ్ల కూల్చివేతలపై సీబీఐ విచారణ జరిపించాలి..!

- **విజయవాడ భవానీపురంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన**
- **జోజీనగర్‌లో ఇళ్లు కోల్పోయిన 42 కుటుంబాలను పరామర్శించిన జగన్**
- **సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే ఇళ్ల కూల్చివేత జరిగిందని ఆరోపణ**
- **ఈ నెల 31 వరకు స్టే ఉన్నప్పటికీ అధికార దుర్వినియోగం జరిగిందని విమర్శ**
- **2.17 ఎకరాల భూమి విలువ రూ.150 కోట్లకు పైగా ఉంటుందని వెల్లడి**
- **భవానీపురం ఇళ్ల కూల్చివేతలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్**
- **ఫేక్ సొసైటీ, భూకబ్జాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలని డిమాండ్.**



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

విజయవాడ భవానీపురంలో వైఎస్ జగన్ పర్యటించారు. భవానీపురంలోని జోజీనగర్ లో 42 ప్లాట్ల బాధితులను ఆయన పరామర్శించారు. భవానీపురంలో ఇటీవల ఇళ్లను కోల్పోయిన 42 కుటుంబాల తరుపున ఆయన అనేక విషయాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టులో పిటిషన్ పెండింగ్ లో ఉందని.. ఈనెల 31వ తేదీ వరకు 42 కుటుంబాలకు సుప్రీం కోర్టు ఊరట ఇచ్చిందన్నారు. అయితే పోలీసులు ప్రైవేట్ పార్టీకి మద్దతు తెలుపుతూ ఇళ్లను కూల్చేశారని.. 31వ తేదీ వరకు గడువు ఉన్నా అధికార దుర్వినియోగం చేసారని మండిపడ్డారు. ఇళ్లు కూల్చేసి 42 కుటుంబాలను రోడ్డుపాలు చేశారన్నారు. 2.17 ఎకరాల విలువ రూ.150కోట్లు పైగా ఉంటుందని.. 42 కుటుంబాలు 25ఏళ్లుగా ఇక్కడే ఇళ్లు కట్టుకుని ఉంటున్నాయని, వాళ్ల ఇళ్లను ధ్వంసం చేసారని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. 2016లో 1981 డేట్ తో తప్పుడు డాక్యుమెంట్లతో తప్పుడు సొసైటీ క్రియేట్ చేసారని.. 2.17 ఎకరాలు కాజేసేందుకు కుట్ర చేశారన్నారు. ఇందులో లోకేష్, కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడు ఇన్వాల్వ్ అయ్యారంటూ.. ఈ ఇళ్లకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి ఉందని తెలిపారు. బ్యాంకులు ఇళ్లు కట్టుకునేందుకు వీళ్లకు లోన్లు కూడా ఇచ్చాయని, స్థలం ఇంకొకరిదే అయితే రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని, అలాగే స్థలం ఇంకొకరిదే అయితే కరెంట్, డ్రైనేజ్ పర్మిషన్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదని.. ప్రైవేట్ వ్యక్తులకు మద్దతు ఇచ్చి జేసీబీలతో ఇళ్లు కూల్చేస్తారా..? స్థలం క్రమవిక్రయాలు జరిగే సమయంలో అభ్యంతరాలు ఉంటే చెప్పమని పేపర్ ప్రకటనలు కూడా ఇచ్చారన్నారు. అయితే అప్పుడు ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదు. చంద్రబాబు, లోకేష్, కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ అంతా ఒక్కటై కుట్ర చేసారని జగన్ అన్నారు. అన్యాయంగా పేదల ఇళ్లను కూల్చేశారని.. భవానీపురంలోనే కాదు ఇలాంటి అన్యాయాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని జగన్ తెలిపారు. లిటికేషన్ ఉన్న భూములను అధికార పార్టీ నేతలే కబ్జా చేయిస్తున్నారని.. కొన్ని చోట్ల అధికార పార్టీ వాళ్లే లిటికేషన్ క్రియేట్ చేస్తున్నారని జగన్ మాట్లాడారు. భవానీపురం ఇళ్ల కూల్చివేతలపై సీబీఐ విచారణ జరిపించాలని.. ఫేక్ సొసైటీ క్రియేట్ చేసి పేద ప్రజల ఆస్తులపై ఎలా కన్నేశారో తేలాలని వైఎస్ జగన్ కోరారు.

# ఆమె గట్టిగా స్పందించడంతో వెనక్కి తగ్గారు: సీఎం చంద్రబాబు

- **ఎన్టీఆర్ భవన్ లో చంద్రబాబు ఇష్టాగోష్టి**
- **న్యాయస్థానాల పట్ల జగన్‌కు గౌరవం లేదని విమర్శలు**
- **పీపీపీ విధానంపై కేంద్రమంత్రిని వైసీపీ ఎంపీలు తప్పుదోవ పట్టించారని ఆరోపణ**
- **రెండు రోజుల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం**
- **పార్టీలో మహిళల ప్రాతినిధ్యాన్ని 30 శాతానికి పెంచుతామని వెల్లడి**
- **పనిచేయని కమిటీలపై ప్రతి మూడు నెలలకు సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ**



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు న్యాయస్థానాల పట్ల ఏమాత్రం గౌరవం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. అక్రమాస్తుల కేసుల్లో కోర్టుకు హాజరుకాకపోవడమే దీనికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. మంగళవారం నాడు అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన చంద్రబాబు, పలు రాజకీయ, పార్టీ అంశాలపై స్పందించారు.

తిరుమల పరకామణి చోరీ కేసును సాధారణ దొంగతనంగా చూడటాన్ని హైకోర్టు తప్పుపట్టిందని గుర్తుచేశారు. ఇది భక్తుల మనోభావాలతో ముడిపడిన తీవ్రమైన విషయమన్నారు. అలాగే, పీపీపీ విధానంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను వైసీపీ ఎంపీలు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, అయితే ఆమె గట్టిగా స్పందించడంతో వారు వెనక్కి తగ్గారని తెలిపారు. పీపీపీ విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైందని, దీనివల్ల పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు.

ఇదే సమయంలో పార్టీ సంస్థాగత అంశాలపైనా చంద్రబాబు దృష్టి సారించారు. టీడీపీ జిల్లా కమిటీల అధ్యక్ష పదవుల నియామకంపై త్రిసభ్య కమిటీలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలయ్యే అవకాశం ఉన్నందున, పార్టీలో మహిళల ప్రాతినిధ్యాన్ని ప్రస్తుతమున్న 28.4 శాతం నుంచి 30 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

రెండు రోజుల్లో జిల్లా అధ్యక్షుల జాబితాను ప్రకటిస్తామని, నెలాఖరులోగా రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి కమిటీల పనితీరును సమీక్షిస్తానని, పనిచేయని వారిని నిర్మొహమాటంగా తొలగిస్తానని హెచ్చరించారు. జనవరి నుంచి నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో పార్టీ క్యాలెండర్ ప్రకారం పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# 18 నెలలుగా ఏపీలో మ్యాజిక్ జరుగుతోంది... ఆ రహస్యం ఏంటని సీఎంలు అడుగుతున్నారు

- **భోగాపురం వద్ద జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు**
- **ప్రపంచ ఏవియేషన్ వర్క్ ఫోర్స్‌లో 25% తెలుగువారే ఉండాలన్నదే లక్ష్యం**
- **విజన్ ఉన్న నేతలను విజన్ లేనివారు ఎగతాళి చేస్తారన్న లోకేష్**
- **ఏపీ అభివృద్ధికి మిస్సైల్స్, జీపీఎస్‌గా పనిచేస్తున్నామని వ్యాఖ్య**
- **ఉచితంగా 136 ఎకరాలు అందించిన మాన్సాస్ ట్రస్ట్**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లో ఒక చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరిగిందని, భోగాపురం సమీపంలో ఏర్పాటు కానున్న జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రపంచానికే ఆదర్శంగా నిలవనుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచ సివిల్ ఏవియేషన్ రంగంలోని వర్క్ ఫోర్స్‌లో 25 శాతం తెలుగువారు ఉండాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో, మాన్సాస్ ట్రస్ట్ సహకారంతో జీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) మంత్రి లోకేశ్ సమక్షంలో జరిగింది. భీమిలి మండలం అన్నవరం వద్ద 136.63 ఎకరాల్లో ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీని అభివృద్ధి చేయనున్నారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "ఏపీలో 18 నెలలుగా ఏదో మ్యాజిక్ జరుగుతోందని, దాని రహస్యం ఏంటని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడుగుతున్నారు. వారికి నేను చెప్పిన సమాధానం ఒక్కటే. మా దగ్గర మిస్సైల్స్, జీపీఎస్ ఉన్నాయి. అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు వంటి అనుభవజ్ఞులైన పెద్దలు మాకు జీపీఎస్‌లా మార్గనిర్దేశం చేస్తుంటే, రామ్మోహన్ నాయుడు, అదితి గజపతిరాజు వంటి యువ నాయకులం మిస్సైల్‌స్‌లా దూసుకుపోతున్నాం. మేం చరిత్ర సృష్టిస్తున్నాం" అని అన్నారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని తెలిపారు.

### ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ జీఎంఆర్ అధినేత

జీఎంఆర్ సంస్థల అధినేతను 'ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ'గా అభివర్ణించిన లోకేశ్, ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి, పదో తరగతి ఫెయిల్ అయినా పట్టుదలతో ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు అవసరమా అని ఆనాడు కొందరు ఎగతాళి చేశారు. కానీ చంద్రబాబు గారి దూరదృష్టి వల్లే నేడు హైదరాబాద్‌కు రెండో విమానాశ్రయం అవసరం లేకుండా పోయింది. ఆ ఎయిర్‌పోర్ట్ తెలంగాణ జీడీపీలో 12 శాతం వాటాను అందిస్తోంది. విజన్ ఉన్న నాయకులను, విజన్ లేని వారు ఎప్పుడూ ఎగతాళి చేస్తారు" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

### మాన్సాస్ ట్రస్ట్ గొప్ప మనసు

ఈ ప్రాజెక్టుకు మాన్సాస్ ట్రస్ట్ ఉచితంగా భూమిని అందించడాన్ని లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. "ఏవియేషన్ ఎడ్యుసిటీ కోసం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాన్సాస్ భూముల మ్యాప్‌తో ముందుకు వచ్చారు. ప్రపంచ స్థాయి సంస్థ వస్తే ఉచితంగా భూమి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం రూపాయి అయినా తీసుకోవాలని నేను సూచించినా, వారు అంగీకరించలేదు. తమ రక్తంలోనే ఏవియేషన్ ఉందని, సంస్థకు మాన్సాస్ పేరు పెడితే చాలని గొప్ప మనసు చాటుకున్నారు. పూసపాటి వంశీయులు వేలాది ఎకరాలను ప్రజల కోసం దానం చేసిన గొప్ప చరిత్ర వారిది" అని అశోక్ గజపతిరాజు, అదితిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### క్లస్టర్ విధానంతో 20 లక్షల ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వం 'ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' విధానంతో పనిచేస్తుందని లోకేశ్ పునరుద్ఘాటించారు. "చైనా తరహాలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధి నమూనాను ఏపీలో అమలు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 20కి పైగా క్లస్టర్లను అభివృద్ధి చేసి, విద్యను పరిశ్రమలతో అనుసంధానిస్తాం. తద్వారా రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే మా లక్ష్యం" అని వివరించారు.

99 పైసలకే భూములు ఇవ్వడం వల్లే విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు వచ్చాయని, రాబోయే 100 రోజుల్లో మరో రెండు పెద్ద ఐటీ కంపెనీలు రానున్నాయని తెలిపారు. ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీని కేవలం 12 నెలల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.




ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పి. అశోక్ గజపతిరాజు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మొదటిసారిగా 22ఏ కేసుల పరిష్కారంపై ఏలూరులో ప్రత్యేక వేదిక

- **రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇదే తొలిసారి**
- **90 శాతం కేసులకు అక్కడికక్కడే పరిష్కారం అందిస్తామన్న మంత్రి నాదెండ్ల**
- **గత ప్రభుత్వ రాజకీయ కక్షల వల్లే భూ సమస్యలు పెరిగాయని ఆరోపణ**
- **ప్రజల నుంచి భారీగా వెల్లువెత్తిన దరఖాస్తులు**



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా 22A భూ సమస్యల పరిష్కారం కోసం ఏలూరు జిల్లాలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మెగా 22A భూ సమస్యల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని ప్రజలు, రైతుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ... గత ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యల కారణంగా రాష్ట్రంలో 22A భూ సమస్యలు తీవ్రంగా మారాయని ఆరోపించారు. తమకు అనుకూలంగా లేని వారి ప్రైవేట్ భూములను కూడా ఉద్దేశపూర్వకంగా 22A జాబితాలో చేర్చారని, దీని వల్ల సామాన్య ప్రజలు, రైతులు తమ భూములను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి, రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు చర్యలు చేపట్టారని తెలిపారు.

ఈ ప్రత్యేక వేదిక ద్వారా జిల్లాలోని 27 మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, 90 శాతం సమస్యలను ఇదే రోజు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దేవాదాయ, ఇతర శాఖలకు సంబంధించిన భూముల సమస్యలను ఒకటి, రెండు వారాల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. మంత్రి, ఎమ్మెల్యేలు స్వయంగా వినతులు స్వీకరించడంపై రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# కాకరకాయ ఒక్కసారి ఇలా ట్రై చేసి చూడండి

కాకరకాయ పేరు వింటేనే చాలామంది ముఖం తిప్పేసుకుంటారు. ఇంట్లో కాకరకాయ కూర చేశారంటే ఆ రోజు ఉపవాసం ఉంటారు. ఎందుకంటే కాకరకాయ చేదుగా ఉంటుందని, తింటే అంత రుచిగా ఉండదని అనుకుంటారు. కానీ సరిగ్గా వండితే ఇతర కర్రీల కంటే కాకర కాయ రుచి అద్భుతంగా ఉంటుంది. అంతేకాకుండా చేదుగా ఉండే కాకరకాయలో ఎన్నో పోషక గుణాలు ఉంటాయని డాక్టర్లు చెబుతుంటారు. కాకరకాయ ఉల్లి కారం ఒక్కసారి తిన్నారంటే ఆ టేస్ట్ జన్మలో మర్చిపోరు. వేడి అన్నం,పప్పు చారు,రసం ఇలా దేనితోనైనా తింటే చాలా రుచిగా ఉంటుంది. కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం చూడండి.

**కాకరకాయ ఉల్లికారం తయారీకి కావాల్సిన పదార్థాలు**



కాకరకాయ
ఉల్లిపాయ
నూనె
ఉప్పు
పసుపు
కారం
జీలకర్ర
వెల్లుల్లి

ముందుగా 400 గ్రాముల లేత కాకరకాయలను తీసుకొని వాటిపైన చెక్కు తీసుకోండి. తర్వాత కాకరకాయ తల, తోక కట్ చేసి కాకరకాయని రెండు ఇంచు ముక్కలుగా కట్ చేసి ఓ బౌల్ లో వేసుకోండి. ఇప్పుడు కాకరకాయ ముక్కలలో 1 టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ఉప్పు వేసి బాగా పట్టించి అరగంట సేపు పక్కన ఉంచండి.

అరగంట తర్వాత కాకరకాయల్లో నుంచి నీరు అంతా దిగుతుంది. అప్పుడు ఒక్కో కాకరకాయను బాగా చేతులోకి తీసుకొని పిండితే అందులోని మిగిలిన చేదు కూడా పోతుంది. అలా పిండిన తర్వాత ఆ ముక్కలను పక్కన ఓ ప్లేట్ లో పెట్టుకోండి. ఇప్పుడు మిక్సీ జార్ లో పెద్దగా కట్ చేసిన పావు కిలో ఉల్లిపాయలు,8 వెల్లుల్లి రెబ్బలు,1 టీస్పూన్ జీలకర్ర, 2 టేబుల్ స్పూన్ల కారం,కొంచెం ఉప్పు వేసి మెత్తని పేస్ట్ లా చేసుకోండి. తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి పావు కప్పు ఆయిల్ పోసి అది కొంచెం వేడయ్యాక అందులో కాకరకాయ ముక్కలను వేసి 56 నిమిషాలు వేపుకోండి. తర్వాత కాకరకాయ ముక్కలను ఓ ప్లేట్ లోకి తీసుకొని వాటిల్లోని గింజలను తీసేసి మిక్సీలో వేసి చేసుకున్న మిశ్రమాన్ని కాకరకాయ ముక్కల్లో స్టఫ్ గా చేసుకోండి. ఇప్పుడు కాకరకాయలు వేపుకున్న నూనెలోనే మరో 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి అందులో స్టఫ్ చేసుకున్న కాకరకాయ ముక్కలను వేయండి. మిగిలిన ఉల్లిపాయ పేస్ట్ ని కూడా అందులో వేసి మీడియం ఫ్లేమ్ మీద 20 నిమిషాలు వేపుకోవాలి.

దింపే ముందు కొంచెం కరివేపాకు చల్లుకోండి. అంతే కరివేపాకు ఉల్లిపాయ కారం రెడీ.



# కలబందను ఎలా వాడాలి?



కలబంద ఆరోగ్యానికి మాత్రమే కాదు.. అందానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని ఉపయోగించి ఎన్నో చర్మ సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకే దీని జెల్ ను డైరెక్ట్ గా ముఖానికి పెట్టేస్తుంటారు. కానీ కలబంద జెల్ ను తీసి అలాగే ముఖానికి పెడితే ఏమౌతుందో తెలుసా? కలబంద జెల్ లో ఎన్నో ఔషద లక్షణాలుంటాయి. ఇది మనకు కెమికల్స్ లాగా ఎలాంటి హాని చేయడదు. అయినప్పటికీ.. దీన్ని డైరెక్ట్ గా అంటే కలబంద గుజ్జును తీసి ముఖానికి పెట్టుకుంటే కొన్ని సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుందని నిపుణఉలు చెబుతున్నారు.

కలబంద జెల్ లో మన శరీరానికి, చర్మానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ ఈ జెల్ ను అలాగే ముఖానికి పెట్టుకోవడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.

కలబంద జెల్ లో టీ ట్రీ ఆయిల్ తో పాటుగా కొన్ని సహజ పదార్థాలను కలపకుండా ముడి కలబందను ముఖానికి ఉపయోగిస్తే కొన్ని చర్మ సమస్యలు వస్తాయి. ఇది చర్మ రకం, సున్నితత్వం మీద ఆధారపడి ఉంటుంది.

కొంతమందికి ముడి కలబందను ఉపయోగించడం వల్ల ఎలాంటి సమస్యలు రాకపోవచ్చు. కానీ కొంతమందికి అలెర్జీ, దద్దుర్లు, దురద, చర్మం ఎర్రబడటం వంటి సమస్యలు వస్తాయి.

నిజమేంటంటే? కలబంద ప్రతి చర్మ రకానికి సరిపోదు. కాబట్టి దీన్ని ఉపయోగించే ముందు ఇది పడుతుందా? లేదా? అని చెక్ చేసుకోవాలి. నేషనల్ సెంటర్ ఫర్ కాంప్లిమెంటరీ అండ్ ఇంటిగ్రేటివ్ హెల్త్ ప్రకారం.. చర్మానికి లోతైన కోతలు లేదా గాయాలు ఉంటే మాత్రం మీరు ఎట్టిపరిస్థితిలో కలబంద జెల్ ను ఉపయోగించకూడదు. ఎందుకంటే కలబంద జెల్ శస్త్రచికిత్సకు సంబంధించిన లోతైన గాయాలు నయం కావడానికి మీ చర్మ సహజ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. పలు నివేదికల ప్రకారం.. కలబంద జెల్ ను పెట్టుకునేటప్పుడు కొంతమందికి మంట, దురద వంటి సమస్యలు వచ్చాయి.

ఒకవేళ దీనివల్ల దద్దుర్లు అయితే మాత్రం వెంటనే దీన్ని పెట్టడం ఆపేయాలి. అలాగే చర్మ అంటువ్యాధులు ఉంటే కూడా కలబంద జెల్ ను పెట్టుకోకూడదు. ఎందుకంటే ఇది అంటువ్యాధులను మరింత పెంచుతుంది.



# మంచంపై కూర్చొని తింటున్నారా? ఈ ఇబ్బందులు తప్పవు..!



మంచం మీద కూర్చొని భోజనం చేయకూడదని ఇంట్లో పెద్దలు చెప్పడం మనం చాలాసార్లు వినే ఉంటాము. పెద్దలు ఎప్పుడూ నేలపై కూర్చొని తినమని సలహా ఇస్తారు. అయితే దీని వెనుక వారి వాదన ఏమిటంటే.. మంచం మీద కూర్చొని తినడం వల్ల లక్ష్మీ దేవిని అవమానిస్తున్నట్లు అని, ఆలా చేయడం ద్వారా ఆమెకు కోపం వస్తుందని చెబుతుంటారు.

ఇది మతపరమైన కారణం. కానీ, శాస్త్రీయ దృక్కోణంలో కూడా మీ ఈ అలవాటు సరైనది కాదు. సుఖం కోసం మీరు కూడా మంచం మీద హాయిగా కూర్చొని తినడం ఆనందిస్తే, ఈ అలవాటు మీ ఆరోగ్యానికి చాలా హానికరం కలిగిస్తుంది. నిజానికి మనం ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? అనేది కూడా చాలా ముఖ్యం. కాబట్టి, మీరు మంచం మీద కూర్చొని ఆహారం ఎందుకు తినకూడదో ఒకసారి చూద్దాం..

**జీర్ణక్రియపై చెడు ప్రభావం:**

నేలపై కూర్చునే భంగిమ కంటే బెడ్‌లోని భంగిమ రిలాక్సింగ్‌గా మారుతుంది. భోజనం చేసేటప్పుడు రెండు భంగిమలు మీ జీర్ణక్రియకు మంచివి కావు. ఇది మీ జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

కొన్నిసార్లు ఇది కడుపులో భారం, యాసిడ్ రిఫ్లక్స్ కు కారణమవుతుంది. ఈ నేపథ్యంలో మంచం మీద కూర్చొని ఆహారం తినాల్సి వస్తే నిటారుగా కూర్చొని సరైన భంగిమలో తినడానికి ప్రయత్నించండి.

**నిద్ర ప్రభావితం**

ప్రతిరోజు బెడ్‌పై ఆహారం తీసుకోవడం కూడా మన నిద్రపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇలా చేయడంవల్ల మన శరీరం ఒక నిర్దిష్ట స్థలాన్ని, దానికి సంబంధించిన కార్యకలాపాలను బాగా గుర్తిస్తుంది. పడక ఎప్పుడూ నిద్రతో ముడిపడి ఉన్నట్లే, స్టడీ టేబుల్ ఎప్పుడూ చదువులతో ముడిపడి ఉంటుంది. కానీ, మీరు మంచం మీద పడుకునే బదులు ఆహారం తిన్నప్పుడు అది మీ మనస్సుకు కొంచెం గందరగోళంగా అనిపించవచ్చు. ప్రతిరోజు ఇలా చేయడం వల్ల, మీరు కొన్నిసార్లు మంచం మీద పడుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

**వేగంగా ఊబకాయం**

మంచం మీద భోజనం చేయడం వల్ల మీ బరువు వేగంగా పెరుగుతుంది. దీని వెనుక చాలా ఆసక్తికరమైన మానసిక కారణం ఉంది. నిజానికి మీరు రిలాక్స్డ్ మూడ్‌లో బెడ్‌పై కూర్చొని ఆహారం తిన్నప్పుడు, సాధారణంగా టీవీ లేదా మొబైల్‌లో వినోదం కూడా దానితో పాటు కొనసాగుతూనే ఉంటుంది. అలా హాయిగా తిండి తిన్నప్పుడు చాలా సార్లు రెండు పూటలా ఆకలితో కాస్త ఎక్కువగానే తినేస్తాం. రోజువారీ ఈ చిన్న అదనపు కేలరీలు మీ బరువు పెరగడానికి కారణమవుతాయి.

**అలెర్జీల సంక్రమణ ప్రమాదం**

మంచం మీద కూర్చొని ఆహారం తినేటపుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని ఆహారపు రేణువులు బెడ్ పైనే ఉండిపోతాయి. ఈ చిన్న కణాలు చాలా రోజులు బెడ్ లేదా బెడ్ షీట్స్ లో ఉంటాయి. కొన్నిసార్లు ఆహర కణాల కారణంగా బొద్దింకలు, చీమలు మంచంలోకి వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందుతుందనే భయం పెరుగుతుంది.

MOVIE TIME

08 CINEMA JOURNALIST DAIRY బుధవారం 17-12-2025

జర్నలిస్ట్ డైలీ
తెలుగు దినపత్రిక



# వశిష్ఠ దర్శకత్వంలో మాస్ మహారాజా కొత్త సినిమా

తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం సైన్స్ ఫిక్షన్ జాతర నడుస్తుంది. 'కల్కి 2898 ఏడీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత, టాలీవుడ్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ తెరమీదకు వచ్చింది. మాస్ మహారాజా రవితేజ - 'బింబిసారా' ఫేమ్ డైరెక్టర్ వశిష్ఠతో కలిసి ఒక సైఫై చిత్రంలో నటించనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇటీవల రవితేజకు వశిష్ఠ స్టోరీ నెరేషన్ ఇచ్చారని, ఈ కథకు మాస్ మహారాజా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ప్రస్తుతం ఈ వార్త టాలీవుడ్ వర్గాల్లో సంచలనం రేపుతోంది.

రవితేజ - వశిష్ఠ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సైన్స్ ఫిక్షన్ సినిమా షూటింగ్ 2026 అర్ధ భాగంలో మొదలవుతుందని, ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వస్తుందని సమాచారం. డైరెక్టర్ వశిష్ఠ ట్రాక్ రికార్డ్‌ను ఒకసారి పరిశీలిస్తే.. టాలీవుడ్‌లో బింబిసారా సినిమాతో సంచలనం సృష్టించిన యువ, ప్రతిభావంతమైన డైరెక్టర్‌గా ఆయనకు మంచి పేరు ఉంది. ఈ సూపర్ హిట్ సినిమా తర్వాత ఆయన ఏకంగా మెగాస్టార్ చిరంజీవితో విశ్వంభర అనే సినిమా తెరకెక్కిస్తున్నారు. ఇది కూడా సోషియోఫాంటసీ జానర్‌లోనే వస్తుంది. ప్రస్తుతం మాస్ మహారాజా రవితేజ నుంచి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధం అవుతున్నారు.

# 'ఓజీ' దర్శకుడికి పవన్ కల్యాణ్ అదిరే గిఫ్ట్

ఓజీ' దర్శకుడు సుజీత్ కు పవన్ కల్యాణ్ అదిరిపోయే బహుమతి ఇచ్చారు. ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారును కానుకగా అందజేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ సుజీత్ ఆనందం వ్యక్తంచేశారు. ''బాల్యం నుంచి పవన్ అభిమానిని అయిన నేను ఇప్పుడు ఆయన్నుంచి గిఫ్ట్ అందుకున్నా. నాకు మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. నా ఓజీ పవన్ కల్యాణ్ ప్రేమ, ప్రోత్సాహం మరువలేనివి. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటా'' అని పేర్కొన్నారు. ఈ కారు ధర రూ.కోటికి పైగానే ఉంటుందని తెలుస్తోంది. పవన్‌తో దిగిన ఫొటోలను సుజీత్ పంచుకున్నారు. ప్రస్తుతం ఇవి నెట్టింట వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పవన్ కొత్త లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కొత్త సినిమా కోసమే పవన్ హెయిర్‌స్టైల్ మార్చారని సమాచారం. 'ఓజీ'తో పవన్ సుజీత్ క్రేజీ కాంబినేషన్ అనిపించుకున్న సంగతి తెలిసిందే. కొంతకాలంగా అభిమానులు తెరపై పవన్‌ను ఎలా చూడాలనుకున్నారో అదే స్థాయిలో చూపించి మెప్పించారు సుజీత్.




సెప్టెంబరులో థియేటర్లలో సందడి చేసిన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. 'ఓజీ' ప్రీక్వెల్, సీక్వెల్ తెరకెక్కించే ఆలోచన ఉన్నట్లు సుజీత్ ఓ సందర్భంలో తెలిపారు. 'ఓజీ' విడుదలకు ముందే నాని హీరోగా ఓ సినిమాని ప్రకటించిన సుజీత్.. ప్రస్తుతం ఆ మూవీ పనులతో బిజీగా ఉన్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' తో మరోసారి ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు పవన్ కల్యాణ్. మరో మూవీ కోసమే ఆయన లుక్ మార్చినట్లు తెలిసింది.

# ఇలాంటి వారితో జాగ్రత్తగా ఉండండి: రకుల్‌ప్రీత్ సింగ్



తన శరీర మార్పులకు కారణం పాస్టిక్ సర్జరీ అని పేర్కొంటూ ఓ వ్యక్తి పెట్టిన పోస్టుపై నటి రకుల్‌ప్రీత్ సింగ్ స్పందించారు. అతడి వ్యాఖ్యలను ఖండించారు. వైద్యులమని చెప్పకొనే ఇలాంటివారితో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ''వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నారు. ఇది భయానకం. నేను సంప్రదాయ వైద్యంతో పాటు ఆధునిక చికిత్సలనూ నమ్ముతా. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సర్జరీలు చేయించుకున్నా నేను తప్పు పట్టను. కానీ, కష్టపడి వ్యాయామం చేసినా బరువు తగ్గొచ్చనే విషయాన్నీ దృష్టిలో పెట్టుకోవాలి'' అని పేర్కొన్నారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు రకుల్ ముఖం పూర్తిగా మారిపోయిందని, అందుకు కారణం ప్లాస్టిక్ సర్జరీ అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరు వీడియో పోస్టు చేశారు. ఆమె ఎన్ని వ్యాయామాలు చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు సర్జరీ చేయించుకున్నారని అందులో పేర్కొన్నారు. నోరా ఫతేహి, జాక్వెలిన్ ఊర్వశీ రౌతేలా, అనన్యాపాండే తదితర హీరోయిన్లు సర్జరీలు చేయించుకున్నట్లు పేర్కొన్న వీడియోలు ఆ ఖాతాలో ఉండడం గమనార్హం.




Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465